విశాలాంధ్ర కృష్ణా జిల్లా

విద్యుత్ విజిలెన్స్ తనిఖీలు-రూ.5.42 లక్షలు జరిమానా

విశాలాంధ్ర-పెదపారుపూడి : మండలంలోని విద్యుత్ శాఖ విజిలెన్స్ ఈఈ కె. వెంకటేశ్వర్లు, ఈఈ టి. రామకృష్ణల ఆధ్వర్యంలో 39 బృందాలుగా అధికారులు ఏర్పడి 3221 గృహ సర్వీసులు, 220 వాణిజ్య సర్వీసులను బుధవారం తనిఖీలు చేశారు. వాటిలో 202 సర్వీసులకు అదనపు లోడు 271 కె. డబ్ల్యూ మొత్తానికి రూ.ఐదు లక్షల 42 వేలు జరిమానాగా విధించినట్లు తెలిపారు. విద్యుత్ చౌర్యం సామాజిక నేరమని విద్యుత్ చౌర్యం చేసిన వారిపై చట్టపరమైన చర్య తీసుకుంటామని తెలిపారు. ఎక్కడైనా విద్యుత్ చౌర్యం జరిగినట్లయితే ఈ క్రింది ఫోన్ నంబర్లకు 94408 12086, 94408 17579, 94408 14269, నంబర్లకు సమాచారం ఇవ్వాలని కోరుతున్నట్లు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో గుడివాడ డివిజన్ పరిధిలోని ఏఈలు, ఏడిఈలు, జేఈలు, ఎల్ఐలు, విజిలెన్స్ అధికారులు పాల్గొన్నారు.

పార్టీ బలం మరింత పెరిగింది

ఎమ్మెల్యే సింహాద్రి రమేష్ బాబు

విశాలాంధ్ర-చల్లపల్లి : గతం గన్న వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ బలం మరింత పెరిగిందని వచ్చే ఎన్నికల్లో 175/175 సీట్లు సాధించడం ఖాయమని అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్ బాబు అన్నారు. చల్లపల్లి మండలం యార్లగడ్డలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం గ్రామ సర్పంచ్ యార్లగడ్డ హేమాంజనేయ ప్రసాద్ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. ఎమ్మెల్యే రమేష్ బాబు ఇంటింటికి వెళ్లి సంక్షేమ పథకాల ప్రయోజనాలు వివరించారు. ఈ సందర్భంగా రమేష్‌బాబు మాట్లాడుతూ వైఎస్ జగన్ సారధ్యంలో పార్టీ నాయకులు, కార్యకర్తలతో పాటు నూతనంగా నియమితులైన గ్రామ సచివాలయ కన్వీనర్లు, గృహసారధులతో వైఎస్ఆర్సిపి ఎంతో పటిష్టవంతంగా ఉందన్నారు. 2019లో ప్రజలకు హామీలిచ్చి ఎన్నికలకు వెళ్లిన వైఎస్ఆర్ సీపీ ఈసారి హామీలన్నీ అమలు చేసి 2024 ఎన్నికలకు వెళుతోందని, ఈసారి కూడా ఖచ్చితంగా వైసీపీకే ప్రజలు అధికారం ఇవ్వటం ఖాయమన్నారు. ఎంపీటీసీ కర్రా రవి, సొసైటీ చైర్మన్ యార్లగడ్డ సత్యాంజనేయ ప్రసాద్, లక్ష్మీపురం ఎంపీటీసీ మోపిదేవి ద్వారకానాథ్, పురిటిగడ్డ సర్పంచ్ మాతంగి రమ్య, ఏఎంసీ డైరెక్టర్లు మోతుకూరి ఏడుకొండలు, అబ్దుల్ అర్షద్, వైసీపీ నాయకులు బొందలపాటి లక్ష్మి, మాతంగి దుర్గారావు, కుందేటి కోటేశ్వరరావు, మోదుమూడి కుటుంబరావు, మేరుగు రమేష్, వెనిగళ్ల తారక జగదీష్, ఈఓఆర్డీ బూరేపల్లి అశోక్, పీఆర్ ఏఈ బొప్పన శ్రీనివాసరావు, హౌసింగ్ ఏఈ ఎం.అరుణ కుమారి, ఆర్.డబ్ల్యూ.ఎస్ ఏఈ భోగాది జగత్, ఎస్ఐ సీహెచ్.చినబాబు, గ్రామ సచివాలయ కన్వీనర్ల మండల కన్వీనర్ యడ్ల జగదీష్, పంచాయతీ ఈఓ కొండవీటి చంద్ర హరీష్ పాల్గొన్నారు.

ఉద్యోగ ఖాళీల భర్తీ

విశాలాంధ్ర-మచిలీపట్నం : రాష్ట్ర వైద్యారోగ్య శాఖ వారి ఆదేశానుసారం 8 కేటగిరీలకు ఎన్ హెచ్ ఎం (నేషనల్ హెల్త్ మిషన్) , ఎన్ యు హెచ్ఎం (నేషనల్ అర్బన్ హెల్త్ మిషన్) లో భాగంగా 1. పీడియాట్రిషన్ మూడుపోస్టులు (ఆర్ బి ఎస్ కే) ,2. మెడికల్ ఆఫీసర్లు మూడుపోస్టులు(ఎన్ బి ఎస్ యు),3. ఒక పోస్టు(ఎం.ఆర్.సి)4. జనరల్ ఫిజీషియన్ ఒక పోస్ట్.5 మెడికల్ ఆఫీసర్ 10పోస్టులకు (ఎన్ యు హెచ్ ఎం) కు సంబంధించిన ఉద్యోగ ఖాళీలను భర్తీ చేయుటకు కృష్ణా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ పరిధిలో గౌరవనీయులైన జిల్లా కలెక్టర్ రంజిత్ భాషా అనుమతితో 18పోస్టులకు అర్హులైన అభ్యర్థులు నుండి దరఖాస్తులను కొరటమైనది . నోటిఫికేషన్ మరియు దరఖాస్తు ఫారం నుకృష్ణ డాట్ ఎన్ ఐ సి డాట్ ఇన్ లో ఉంచడం జరిగింది. పూర్తిచేసిన దరఖాస్తు తో పాటు అభ్యర్థులు స్వయంగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయం మచిలీపట్నం నందు ఈనెల 10 వతేదీ సాయంకాలం ఐదు గంటలు లోపు హాజరు కావలసిందిగా కోరుచున్నాము.జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిని జి. గీతాబాయి బుధవారం ప్రకటనలో తెలియజేశారు.

ది టీచర్స్ కో-అపరేటివ్ క్రెడిట్ సొసైటీ అధ్యక్షులుగా సువర్ణలత

విశాలాంధ్ర-గన్నవరం : గన్నవరం ది టీచర్స్ యం పి అండ్ పి ఆర్ ఎంప్లాయిస్ కో అపరేటివ్ క్రెడిట్ సొసైటీ గన్నవరం కార్యాలయంలో 6-2-2023న సోమవారం పాలక వర్గ ఎన్నికలు ఏకగ్రీవంగా జరిగాయి. అధ్యక్షులుగా ఎస్ సువర్ణ లత, ఉప అధ్యక్షులుగా డి జయ ప్రకాష్, సెక్రటరీ గా ఎస్ రాజశేఖర్, డైరెక్టర్లుగా జి శివశంకర్ రెడ్డి, సిహెచ్ మురళి శ్రీనివాసు, టి విజయ కుమారి,పి రాజశేఖర్, యం గౌరిప్రసాద్,యం ఎస్ కె శ్రీనివాస్ లు ఏకగ్రీవంగా ఎన్నిక్కేయారు. ఈ సొసైటీ 1970లో ఎస్టీయూ నాయకులు పెద్దు వెంకటరత్నం చీఫ్ ప్రమోటర్ స్థాపించారు.

కాపులకు అన్యాయం చేసిన జగన్

విశాలాంధ్ర-ఉంగుటూరు : పేద విద్యార్థులకు జగన్‌మోహన్‌రెడ్డి విదేశీ విద్య అన్యాయంగా దూరం చేయడాన్ని నిరసిస్తూ..విదేశీ విద్య పథకాన్ని నిబంధనల పేరుతో కుదించటం ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, కాపులకు తీవ్ర అన్యాయం జరుగుతుందని టీడీపీ మండల పార్టీ అధ్యక్షులు డా ఆరుమాళ్ళ వెంకట కృష్ణారెడ్డి విమర్శించారు. బుధవారం ఆయన తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు అభిమానులతో కలసి ఉంగుటూరు డా బి ఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి తహసీల్దార్ వనజాక్షికి వినతిపత్రం ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు డాక్టర్ అరుమాళ్ళ వెంకట కృష్ణా రెడ్డి గారు, పార్లమెంటరీ రైతు విభాగ కార్యదర్శి దూడ్ల కుమార్, పార్లమెంటరీ వాణిజ్య విభాగ నాయకులు నూతక్కి బెనర్జీ, ముక్కపాడు యూనిట్ ఇంచార్జి మాధు రమేష్, మధిరపాడు గ్రామపార్టీ కార్యనిర్వాహక కార్యదర్శి టి దుర్గ,బండి రవి తదితరులు పాల్గున్నారు.

శాంతినికేతన్ విద్యార్థుల ప్రదర్శన

విశాలాంధ్ర-కృత్తివెన్ను : ప్రతిష్టాత్మక భీమవరం మావుళ్ళమ్మ అమ్మవారి ఉత్సవాలలో లక్ష్మీపురానికి చెందిన శాంతినికేతన్ పాఠశాల విద్యార్థుల కూచిపూడి, భరతనాట్యం ప్రదర్శలను ఆహుతులను ఆకుట్టుకున్నాయి. మంగళవారం రాత్రి ఉత్సవాలలో విద్యార్థుల ప్రదర్శన ఇచ్చినట్లు స్కూల్ కరస్పొడెంట్ ముఖేష్ కుమార్ తెలిపారు. తమ విద్యార్థుల ప్రదర్శనకు భక్తుల నుండి విశేష స్పందన వచ్చినట్లు ఆయన బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. శ్రీ మావుళ్ళమ్మ అమ్మవారి ఉత్సవాలలో ప్రదర్శన ఇవ్వటానికి పెద్దపెద్ద కళాకారులు పోటీపడుతూ ఉంటారు. అటువంటి చోట తమ విద్యార్థుల ప్రదర్శన ఇవ్వడం విద్యార్థుల సామర్థ్యానికి నిదర్శనమని కరస్పొడెంట్ ప్రకటనలో పేర్కొన్నారు. ప్రతి సంవత్సరం పశ్చిమ గోదావరి జిల్లా భీమవరంలో మావుళ్ళమ్మ ఉత్సవాలు ఎంతోప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తుంటారు. భరతనాట్య, కూచిపూడి ప్రదర్శనలు ఇచ్చిన విద్యార్థులను ఉత్సవ కమిటీ వారు అభినందించారు.

సామాజిక తనిఖీ ప్రజావేదిక

విశాలాంధ్ర-అవనిగడ్డ : మండలంలో సామాజిక తనిఖీ బృందం 15వ విడత ప్రజావేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎ.పి.ఒ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన ఈ కార్యక్రమంలో తనిఖీ అధికారిగా వెంకట లక్ష్మీ హాజరు కాగా, ఎం.పి.పి తుంగల సుమతీ, జడ్.పి.టి.సి చింతలపూడి లక్ష్మీనారాయణ, క్లస్టర్ ఎ.పి.డి శ్రీలత, డి.వి.ఒ విజయలక్ష్మి ఇంచార్జ్ ఎం.పి.డి.ఒ, సోషల్ ఆడిట్ సభ్యులు పాల్గొని ఉపాధి హామీ సిబ్బంది,కూలీలు,హాజరు, పనిదినాలు తదితర విషయాలను తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎ.పి.ఒ, షేక్ నజీర్ భాషా లతో పాటు పలువురు పాల్గొన్నారు.

సబ్ డివిజన్ పరిధిలో పోలీసులకు ప్రత్యేక వైద్య శిబిరం

విశాలాంధ్ర-అవనిగడ్డ : సబ్ డివిజన్ పరిధిలోని పోలీస్ సిబ్బందికి ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు అవనిగడ్డ డిఎస్పీ మహబూబ్ బాషా ఆధ్వర్యంలో బుధవారం అవనిగడ్డ సబ్ డివిజన్‌లోని చల్లపల్లి, అవనిగడ్డ సర్కిల్ పరిధిలోని పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న 45 సంవత్సరాల పైబడిన పోలీస్ సిబ్బందికి అవనిగడ్డ ప్రభుత్వ వైద్య శాలలో మేగా హెల్త్ చెకప్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈవైద్య శిబిరంలో డిఎస్పీ మహబూబ్ భాషా దగ్గర ఉండి సబ్ డివిజన్ పరిధిలోని 73 మంది సిబ్బందికి హెల్త్ చెకప్ చేయించారు. ఈ కార్యక్రమంలో అవనిగడ్డ, చల్లపల్లి సి.ఐ లు జి శ్రీనివాస్, బి బి రవికుమార్ పోలీస్ సిబ్బంది, వైద్యులు తదితరులు పాల్గొన్నారు.

మనోల్లాసభరితం చిత్ర గీతాల గానం

విశాలాంధ్ర-విజయవాడ కల్చరల్ : తెలుగు కళావాహిని, జి.ఆర్.కె పోలవరపు సాంస్కృతిక సమితి,శ్రీ కళా భారతి సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం సాయంత్రం కౌతా పూర్ణానందం కళావేదికపై జరిగిన సినీ సంగీత విభావరి శ్రోతల మనసులను ఉల్లాస పరుస్తూ సాగింది. పావని, శోభాదేవి, దమయంతి, షబనా, శ్రీదుర్గా నాగమణి, విజయశ్రీ, దేవిడ్ రాజ్, రాజేష్, ఎం రాజ్, మోహన్ రాజ్, కొండలరావు తదితరులు పలు చిత్రాలలోని పాటలను రసరమ్యంగా పాడి వినిపించి శ్రోతల కరతాళ ధ్వనులందుకున్నారు. ఇటీవల కాలధర్మం చేసిన ఆల్ ఇండియా ఘంటసాల చైతన్య వేదిక వ్యవస్థాపకురాలు కోట ఝాన్సీరాణికి నీరాజనాలర్పిస్తూ గాయనీ గాయకులు పాడి వినిపించారు. చింతకాయల చిట్టిబాబు పర్యవేక్షించారు. అతిథులుగా అధికార భాషా సంఘం అధ్యక్షులు విజయబాబు, సీనియర్ పాత్రికేయులు కృష్ణంరాజు, గోళ్ళ నారాయణరావు, చీదెళ్ళ నాగేశ్వరరావు, శింగంశెట్టి చంద్రశేఖర్, డాక్టర్ చెట్లపల్లి మారుతి ప్రసన్న, కొప్పరపు వెంకట బలరామకృష్ణమూర్తి తదితరులు విచ్చేసి గాయనీ గాయకులను అభినందిస్తూ, ఘంటసాల పాటలపై అపరిమిత భక్తి గౌరవాలు కలిగిన కోట ఝాన్సీరాణి మరణం కళా రంగానికి తీరని లోటని, సినీ సంగీత విభావరులకు ప్రోత్సాహాన్నందిస్తూ అందరి అభిమానాన్ని పొందిన ఆమెకు చలనచిత్ర గీతాలాపనే నివాళులన్నారు.

ఒరిజినల్ డాక్యుమెంట్ పోయినది

డి.09-12-1982న చల్లపల్లి సబ్‌రిజిస్ట్రారు వారి కార్యలయంలో రిజిస్టారు కాబడిన డాక్యుమెంట్ నెంబరు 42/BK3 ఒరిజినల్ డాక్యుమెంటు జిరాక్స్ నిమిత్తం డి.30-01- 2023న ఇంటి వద్ద నుండి తీసుకువెళుతుండగా మార్గమధ్యలో పడిపోయినది. ఎవరికైనా దొరికిన యెడల ఈక్రింది అడ్రస్సుకు తెలియజేయగలరు.

షేక్. సాహెబ్ హుస్సేన్
తండ్రి మహ్మద్ ఇబ్రాహిం
డోర్ నెం : 10-28 చల్లపల్లి
సెల్ : 9676338708

సిబ్బంది ఆరోగ్యంపై శ్రద్ధ తీసుకోవాలి

విశాలాంధ్ర-మచిలీపట్నం : ఉద్యోగరీత్యా అనేక ఒత్తుడులతో పోలీసులు కర్తవ్యాన్ని నిర్వహిస్తారని కాబట్టి ఆరోగ్యం పట్ల ప్రతి ఒక్కరు శ్రద్ధగా ఉండాలని జిల్లా ఎస్పీ పి జాషువా అన్నారు. బుధవారం మచిలీపట్నం నందు పోలీస్ వెల్ఫేర్ కల్యాణ మండపంలో మెగా హెల్త్ క్యాంప్‌ను నిర్వహించారు. ఈ మాట్లాడుతూ ఇందులో భాగంగా మొదటి విడతగా 40 సంవత్సరాలు పైబడిన 1041 మంది సివిల్, ఏ ఆర్, స్పెషల్ ఎన్ఫోర్స్మెంట్ బ్యూరో, హోమ్ గార్డ్స్, జిల్లా పోలీస్ కార్యాలయ సిబ్బంది ఇతర విభాగాలకు చెందిన పోలీస్ సిబ్బందికి అన్ని రకాల వైద్య పరీక్షలు నిర్వహించడం జరిగిందన్నారు. తీవ్ర అనారోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నవారికి, మితిమీరిన అనారోగ్య సమస్యలతో బాధ పడుతున్న వారికి వైద్యుల సూచనల మేరకు, రాష్ట్ర గౌరవ డిజిపి కసిరెడ్డి రాజేంద్రనాథ్ రెడ్డి ఆదేశాల మేరకు ఉత్తమ వైద్యశాలలో మెరుగైన వైద్యం అందించేలా చర్యలు తీసుకున్నామన్నారు. క్షణం తీరికలేని విధులు, సమయాభావం లేని ఆహారపు అలవాట్లు, నిద్రలేమి మొదలైన కారణాల వలన సిబ్బంది ఆరోగ్యం పై ప్రత్యేక దృష్టి కేటాయించడం లేదు. వీటివలన ప్రస్తుతం ఏ సమస్య లేకుండా దీర్ఘకాలంలో అనారోగ్య సమస్యలను ఎదుర్కోవాల్సి వస్తుంది. కాబట్టి విధులపై దృష్టి కేటాయించలేక, కుటుంబ సభ్యులతో సరదాగా గడపలేక తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. ఇటీవల కాలంలో రహదారి ప్రమాదం లో ఒక హెడ్ కానిస్టేబుల్ మరణించగా గుండెపోటుతో మరొక హెడ్ కానిస్టేబుల్ మృతి చెందటం చాలా బాధ కారమైన విషయం అన్నారు. మరి ముఖ్యంగా పోలీస్ సిబ్బందికి సంబంధించి వైద్య శిబిరం నిర్వహించడానికి జిల్లా హాస్పిటల్ సర్వీసెస్ కోఆర్డినేటర్ డాక్టర్ ఎస్.ఇంద్ర దేవిని, డిఎంహెచ్ఓ గీతాబాయిని, అడగగానే మెడికల్ క్యాంపు నిర్వహణకు అంగీకరించినందుకు జిల్లా పోలీస్ శాఖ తరపున ప్రత్యేక కృతజ్ఞతలు అన్నారు. అలాగే హాస్పటల్ సూపరెంట్ వరప్రసాద్ని డిప్యూటీ సూపరెంట్ చంద్రశేఖర్ మెడికల్ కాలేజ్ ప్రిన్సిపల్ విజయ్ కుమార్ కి ఈ మెడికల్ క్యాంపు విచ్చేసిన వైద్యులకు వైద్య సిబ్బందికి అందరికీ ప్రత్యేక ధన్యవాదాలు. ఈ మెగా వైద్య శిబిరంలో మొత్తం 13 రకాల వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నారని దీనిని 40 సంవత్సరాల ప్రతి ఒక్కరు వినియోగించుకోవాలని ఎస్పీ తెలిపారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ అడ్మిన్ వెంకట రామాంజనేయులు, అడిషనల్ ఎస్పీ ఏ ఆర్ ఎస్ వి డి ప్రసాద్, డీఎస్పీలు స్పెషల్ బ్రాంచ్, డిసిఆర్బి, ఎస్ ఈ బి, పట్టణ ఇన్స్పెక్టర్లు, రిజర్వ్ ఇన్స్పెక్టర్లు, ఎస్సైలు, ఆర్ఎస్ఐలు సిబ్బంది పాల్గొన్నారు.

గుడివాడలో ఇదేం ఖర్మ రాష్ట్రానికి

విశాలాంధ్ర-గుడివాడ : గుడివాడ ప్రజల కోసం నీవు చేస్తున్న పోరాటం ఎంతో గొప్పది దేవుడు నీవు చేస్తున్న మంచి పనులకు తప్పు కుండ నీకు విజయాన్ని అందిస్తాడని మమత వృద్ధుల ఆశ్రమంలోని వృద్ధులు మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావును దీవించారు. బుధవారం స్థానిక 32వ వార్డులో టిడిపి వార్డు నాయకులు సత్యప్రసాద్, గొర్ల పాండురంగారావు, సూరపనేని బాబిల ఆధ్వర్యంలో ఇదేం కర్మ మన రాష్ట్రానికి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రావి ఇంటింటికీ తిరుగుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అనుసరిస్తున్న విధనల వల్ల ప్రజలు ఏవిధంగా నష్టపోతునరో తెలిపారు. ఈ సందర్భంగా వార్డు మహిళలు రావికి పూర్తిస్థాయి మద్దతు తెలుపుతు వచ్చే ఎన్నికల్లో నీ విజయాన్ని ఎవరు అపలేరని దీవించారు. ఈ కార్యక్రమంలో పట్టణ టిడిపి అధ్యక్షుడు దింట్యాల రాంబాబు, నాయకులు పడాల్రు సాంబయ్య,చల్లగుళ్ళ వెంకటేశ్వరరావు, ఆదినారయణ, మధుసుదనరావు, శొంఠి రామకృష్ణ,బుజ్జి, రెడ్డి అప్పారావు, నీరుడు సురేష్, కోలవెను గోపాలకృష్ణ తదితరులు, పాల్గొన్నారు.

పెదన మండల టీడీపీ సమీక్ష సమావేశం

విశాలాంధ్ర-పెడన: పెడన నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ కార్యాలయం లో మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు శలపాటి వీరప్రసాద్ అధ్యక్షతన బుధవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పెడన నియోజకవర్గం ఇంచార్జ్ రాష్ట్ర కార్య నిర్వహణ కార్యదర్శి కాగిత కృష్ణ ప్రసాద్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కాగిత కృష్ణ ప్రసాద్ మాట్లాడుతూ పార్టీ శ్రేణులకు ఈ ప్రభుత్వం అవలంబిస్తున్న అరాచకాలను దుర్మార్గాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని పిలుపునిచ్చారు. తెలుగుదేశం పార్టీ ప్రతి ఒక్క నాయకుడు కార్యకర్తలు పార్టీ బలోపేతానికి కృషి చేయాలని దిశా నిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో పెడన జడ్పిటిసి అర్జా వెంకట నగేష్ పెడన మండలం ప్రధాన కార్యదర్శి శీరం ప్రసాద్ మచిలీపట్నం పార్లమెంటు కార్యనిర్వాహన కార్యదర్శి ఉమ్మడిశెట్టి శ్రీరామ్మూర్తి గూడూరు మండలం పార్టీ అధ్యక్షులు పోతన స్వామి రాష్ట్ర ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి గోపు నాగబాబు బంటుమిల్లి మండలం పార్టీ ప్రధాన కార్యదర్శి బొర్రా కాశి నాలుగు మండలాల వివిధ భాగాల అధ్యక్షులు ఉపాధ్యక్షులు కార్యదర్శులు బూతు క్లస్టర్ రాష్ట్రస్థాయి నాయకులు జిల్లాస్థాయి నాయకులు కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేశారు.

విద్యార్థుల మధ్యాహ్న భోజనంలో రాజీవద్దు

విశాలాంధ్ర-పమిడిముక్కల: విద్యార్థులకు పెట్టే మధ్యాహ్నం భోజనం లో ఎలాంటి రాజీపడవద్దని ముఖ్యమంత్రి విద్యార్థుల భవిష్యత్తు ఆరోగ్యం కొరకు కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తున్నారని జడ్పిటిసి సభ్యురాలు యేసుగ వెంకటరమణ కుమారి అన్నారు. బుధవారం మంటాడ సచివాలయాన్ని మంటాడ మెయిన్ మండల పరిషత్ పాఠశాలని అంగన్వాడి 2 కేంద్రాన్ని ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పెట్టే మధ్యాహ్నం భోజనాన్ని పరిశీలించి రుచి చూచి సంతృప్తి వ్యక్తం చేశారు. వైయస్సార్ సంపూర్ణ పోషణ జగనన్న గోరుముద్ద పథకాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర రెడ్డిక కార్పొరేషన్ డైరెక్టర్ కె. రాంబాబు ప్రధానోపాధ్యాయురాలు ప్రకాష్ కుమారి వైసిపి నాయకులు యేసుగు మస్తాన్రావు అబ్దుల్ అజీజ్ కొణతం శివరామకృష్ణ సాయి లక్ష్మి కే కృష్ణకుమారి తదితరులు పాల్గొన్నారు.

గృహ నిర్మాణాలను చేపట్టాలి

విశాలాంధ్ర-అవనిగడ్డ : జగనన్న లేఅవుట్ లలో లబ్దిదారులు త్వరితగతిన గృహ నిర్మాణాలు చేపట్టాలని, మండల స్థాయి అధికారులు సూచించారు. అవనిగడ్డలోని లబ్ది దారులకు పాత ఎడ్లంక మామిడి తోట్లలో గృహ నిర్మాణాల నిమిత్తం స్థలాలు కేటాయిం చారు. ఈ ప్రాంతంలో కేవలం 20 మంది లబ్దిదారుల లోపుగా గృహ నిర్మాణాలను చేపట్టడం మిగిలిన స్థలాలలో లబ్దిదారులు గృహ నిర్మాణాలకు ఆసక్తి చూపకపోవడంతో లబ్దిదారులతో రెవెన్యూ, మండల పరిషత్, హౌసింగ్ అధికారులు సమావేశం నిర్వహించి అవగాహన కల్గించారు. గృహ నిర్మాణాలు త్వరితగతిన చేపట్టాలని జగనన్న లే అవుట్‌లలో మౌళిక సదుపాయాలను ఏర్పాటు చేస్తామని అధికారులు హామీ ఇచ్చారు.

విషాదంలో పెనుబోతు రవితేజ కుటుంబం

విశాలాంధ్ర-పెదపారుపూడి : మోపర్రులో పెనుబోతు రవితేజ కుమారుడు (4) ఇటీవల ప్రమాదకరమైన వ్యాధితో బాధపడుతూ బుధవారం మృతి చెందగా, ఆ కుటుంబాన్ని తెలుగుదేశం పార్టీ పామర్రు నియోజకవర్గ ఇన్చార్జి వర్ల కుమార్‌రాజా, మండల పార్టీ అధ్యక్షుడు చలసాని రమేష్ చౌదరి, ఆ గ్రామ పార్టీ అధ్యక్షుడు ఉప్పనేని అనీల్‌తో వెళ్లి ఆ బాలుడు మృతదేహానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో ఆ గ్రామ నాయకులు వంగా రంగారావు, కనగాల అశోక్, జూపల్లి రాజేష్, గుడ్డేటి సుధాకర్, గ్రామస్తులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఎడ్యుకేషన్ ఎక్స్ పో-2023

విశాలాంధ్ర-విజయవాడ : బెంగుళూరుకు చెందిన రియో, క్యూబర్ టెక్నాలజీస్ సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 9,10 తేదీలలో బెంజి సర్కిల్ సమీపంలో గల వేదిక కల్యాణ మండపంలో ఎడ్యుకేషన్ ఎక్స్ పో-2023 నిర్వహిస్తున్నట్లు సంస్థల మేనేజింగ్ డైరెక్టర్‌లు వినయ్ రమేష్, సతీష్‌లు తెలిపారు. నగరంలోని ఒక హోటల్ లో బుధవారం ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో వారు మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత స్థాయిలో స్థిరపడాలంటే కాలానుగుణంగా మారుతున్న సాంకేతిక పరిజ్ఞానాన్ని జోడించి ఉన్నత ప్రమాణాలతో నాణ్యమైన విద్యను అందించే సంస్థల ఎంపిక చాలా కీలకమన్నారు. అయితే ఇది విద్యార్థులకు ఎంతో శ్రమతో కూడుకున్న అంశమని తెలిపారు. ప్రముఖ విద్యాసంస్థలను ఒక వేదికపై కి తీసుకురావడం ద్వారా వారి అభిరుచులకు అనుగుణంగా కోర్సు , విద్యాసంస్థను ఎంపిక చేసుకునే వెసులుబాటు కలుగుతుందన్నారు. ఈ క్రమంలో తాము నిర్వహించే ఎక్స్ పో లో బెంగుళూరుకు చెందిన ప్రఖ్యాత విద్యాసంస్థలైన ఎం.ఎస్ రామయ్య, నిట్టే మీనాక్షి లతో పాటు 30కి పైగా విద్యాసంస్థలు పాల్గొంటాయని తెలిపారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని వారి భవిష్యత్తు ను ఉన్నతంగా తీర్చిదిదేసుకోవలని కోరారు.

నేడు ట్రాన్స్ జెండర్స్ సమస్యలపై సమావేశం

విశాలాంధ్ర-విజయవాడ (గాంధీనగర్) : ట్రాన్స్ జెండర్స్ సమాజంలో ఎదుర్కొంటున్న సమస్యలు,వాటి పరిష్కారానికి ప్రభుత్వం తీసుకొవలసిన చర్యలు వివరించటానికి గురువారం(నేడు) నగరంలో ఉన్న హోటల్ మనోరమలో ఉదయం రాష్ట్ర స్థాయి సమావేశం నిర్వహిస్తున్నామని కేసీ పుల్లయ్య ఫౌండేషన్ సీఈఓ డా. సిహెచ్ సుధారాణి తెలిపారు. బుధవారం గాంధీనగర్‌లోని ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో అమె మాట్లాడుతూ ఇతర రాష్ట్రాల్లో ట్రాన్స్ జెండర్స్‌కి వెల్ఫేర్ బోర్డులు ఉన్నాయని మన రాష్ట్రంలో కూడా ఏర్పాటు చేయాలన్నారు. సుప్రీంకోర్టు ట్రాన్స్ జెండర్స్‌కి బోర్డు ఏర్పాటు చేయాలని గతంలోనే తీర్పు ఇచ్చిందన్నారు. కనీసం వారికి ఇల్లు అద్దెకు ఇవ్వడం లేదన్నారు. ట్రాన్స్ జెండర్స్‌కి ఆరోగ్య శ్రీ అమలు చేయాలన్నారు.ఇతర రాష్ట్రాలలో వారికి ఉపాధి ఉద్యోగ అవకాశల్లో రిజర్వేషన్లు అమలు చేస్తున్నారని ఇక్కడ కుడా అమలు చేయాలని కోరారు. ఇటువంటి అనేక సమస్యలపై చర్చించి ప్రభుత్వం దృష్టి తీసుకువెళ్ళతామన్నారు. నేటి సమావేశానికి మంత్రి ఉష శ్రీ చరణ్, ఇతర ప్రజాప్రతినిధులు,అధికారులు పాల్గొంటారన్నారు. ఈ కార్యక్రమంలో విభిన్న ప్రతిభావంతుల,వయోవృద్ధుల సహాయ సంస్థ చైర్ పర్సన్ ముంతాజ్ పటాన్,ఓ గురు బ్రహ్మయ్య,ఎస్ వీణ,బి. కిరణ్ నాయక్,పి సూర్య రాజా యాదవ్ పాల్గొన్నారు.

బెరాకా మినిస్ట్రీస్ సేవలు అభినందనీయం : డీఆర్ఓ

విశాలాంధ్ర-మచిలీపట్నం : అందరిని ఆదుకోవాలని ఆలోచన ఉండడం గొప్ప విషయమని కృష్ణా జిల్లా రెవిన్యూ అధికారి ఎం. వెంకటేశ్వర్లు అన్నారు. స్థానిక కలెక్టరేట్ ప్రాంగణం లో బెరాకా సంస్థ అధ్యక్షులు కిరణ్ పాల్ ఆధ్వర్యంలో రూ.1.70 లక్షలు విద్య, వైద్యం కోసం పేదలకు చేయూతనందించారు డిఆర్డీఓ వెంకటేశ్వర్లు చేతుల మీదుగా విద్యార్థికి లాప్ టాప్, అంగ వైకల్యం తో బాధపడుతున్న వృద్ధునికి ట్రై సైకిల్, ఇనుగుదురు పోలీస్ స్టేషన్ వారికి సి. సి.కెమెరా ను, డి.ఆర్.బుధవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఈ సమాజంలో సేవ చేయాలి అనే సంకల్పం, సదాశయం గొప్ప విషయాలని ఆ దిశగా పయనిస్తూ ఎందరో పేద, దివ్యంగులకు చేయూత అందించడమే కాక విద్య వైద్య కోసం సాయం అందిస్తున్న బెరాకా మినిస్ట్రీస్ సంస్థ అసామాన్య సేవలు నిత్యం అందించడం అభినందదాయకమన్నారు. ఈ సంస్థ నిర్వాహకులు డాక్టర్ కిరణ్ పాల్ సేవా దృక్పథంతో ముందడుగు వేయడం చాలా సంతోషకరమైన విషయమని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్ట్ డైరెక్టర్ నాగిశెట్టి దానియల్, ఈ.సి. మెంబర్ సూరత్ ప్రసాద్, ఆకూరి ప్రభు దేవా తదితరులు పాల్గొన్నారు.

శాప్ వీసీఎండిగా కె.హర్షవర్ధన్ భాధ్యతల స్వీకరణ

విశాలాంధ్ర-విజయవాడ స్పోర్ట్స్ : ఆంధ్రప్రదేశ్ క్రీడాప్రాధికారసంస్థ (శాప్) వైస్‌చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ ఎన్.ప్రభాకరరెడ్డి (ఐఏఎస్) పై అవినీతి ఆరోపణల నేపధ్యంలో ప్రభాకర్‌రెడ్డిని బదిలీ చేశారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కెఎస్. జవహర్‌రెడ్డి (ఐఏఎస్), ప్రభాకర్‌రెడ్డిని జనరల్ అడ్మినిస్ట్రేషన్ విభాగానికి రిపోర్టు చేయాలని ఉత్తర్వులు జారీచేశారు. ప్రభాకరరెడ్డి స్థానంలో సాంఘిక సంక్షేమశాఖ డైరెక్టర్ కె.హర్షవర్ధన్‌కు పూర్తిస్థాయి అదనపు బాధ్యతలను ఇస్తున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఈ మేరకు హర్షవర్ధన్ బుధవారం నగరంలోని శాప్ కార్యాలయంలో భాధ్యతలను స్వీకరించారు. ఏడాది కాలంగా ఆంధ్రప్రదేశ్ క్రీడాప్రాధికార సంస్థ వైస్‌చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన ఎన్.ప్రభాకరరెడ్డి (ఐఏఎస్)పై నిధుల దుర్వినియోగం, లైంగిక వేధింపులకు పాల్పడినట్లు ఆరోపణలను ఎదుర్కొన్నారు. రెండు రోజుల క్రితం శాప్ బోర్డు సభ్యులుతో నిర్వహించిన శాప్ పాలకమండలి సమావేశంలో నలుగురు బోర్డు సభ్యులు ఇదే తరహా ఆరోపణలను చేయగా, ప్రభాకరరెడ్డిని బదిలీ చేసినట్లు సమాచారం.

సంక్షేమ పథకాల అమలుపై అసంతృప్తి

విశాలాంధ్ర-గుడ్లవల్లేరు: మండలంలోని వివిధ గ్రామాలలో ప్రభుత్వపరంగా చే పట్టిన సంక్షేమ పథకాల అమలుకు సంబంధిత లబ్ధిదార్లు తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేస్తున్నారు. ముఖ్య మంత్రి వై.ఎస్. జగన్మోహన రెడ్డి నేతృత్వం లో ప్రారంభించిన నవరత్నాలు పాలకపక్షానికి నగుబాటు తెస్తున్నాయన్న భావన వీరిలో అధికంగా ఉంది. ఉదాహరణకు పేదవర్గాలకు వర్తింపచేసిన జగనన్న గృహాల నిర్మాణం చేపట్టి రెండు సంవత్సరాలైనా పూర్తయి న వాటిని కూడా లబ్దిదార్లకు అందించుటలో అధికారులు మీన మేషాలు లెక్కపెడుతున్నారనీ, అర్హులైన వారిని గుర్తించి ఫెంక్షన్‌లను అందించుటలో కూడా అధికార యంత్రాంగం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని వారు ఆరోపిస్తున్నారు.

లక్ష్మీపురంలో వేదవ్యాస్ పర్యటన

విశాలాంధ్ర-కృత్తివెన్ను : తెలుగుదేశం పార్టీ ఉపాధ్యాక్షుడు, మాజీ డిప్యూటీ స్పీకర్ బూరగడ్డ వేదవ్యాస్ మండలంలో పర్యటించారు. లక్ష్మీపురంలో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ పులగం మణికంఠ కుమారుడి పుట్టినరోజు వేడుకలలో పాల్గొన్నారు. తెలంగాణ ప్రభుత్వ ఇరిగేషన్ శాఖ సహాయక కార్యదర్శి లింగం సుబ్బలక్ష్మీ కూడా ఈ వేడుకలలో పాల్గొన్నారు. అనంతరం పార్టీ నాయకులు, అభిమానులతో ఇష్టాగోష్టి గా మాట్లాడారు. ప్రస్తుతం మండలంలో నెలకొన్న రాజకీయ పరిస్థితులపై వారితో చర్చించారు. ధాన్యం అమ్మిన రైతులకు ప్రభుత్వం డబ్బులు ఇవ్వడంతో తీవ్రమైన జాప్యం చేస్తుందని రైతులు వ్యాస్ దృష్టికి తీసుకువచ్చారు. ఈ కార్యక్రమంలో లక్ష్మీపురానికి చెందిన ప్రముఖ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ పులగం రామాంజనేయులు, శీతాల తాతాజీ, కొప్పర్తి బాబి, పుప్పాల నరసింహారావు, ఆరవ శేషుబాబు, పట్టపు రాము, మానేపల్లి శ్రీనివాసరావు, పులి ఆంజనేయులు, పట్టపు ప్రసాదు, కొప్పర్తి ఏసు, పులగం చిన్నా తదితరులు పాల్గొన్నారు.

సంప్రదాయ హరికథకుడు గుడిపాటి

విశాలాంధ్ర-విజయవాడ కల్చరల్ : హరికథా విలువలతో హరికథా గానం చేసిన గుడిపాటి శ్రీరామమూర్తి భాగవతులు సంప్రదాయ హరికథకుడని వక్తలు పేర్కొన్నారు. బుధవారం సాయంత్రం సత్యనారాయణపురం శ్రీ సీతారామ కళ్యాణమండపంలో గుడిపాటి వారి 116 వ జయంత్యుత్సవం జరిగింది. గుడిపాటి శ్రీరామచంద్రదత్తు నిర్వహణలో అతిథులుగా బుర్రా పద్మనాభశర్మ భాగవతులు,దావులూరి వీరభద్రరావులు మాట్లాడుతూ భవిష్యత్తరానికి హరికథ ఉత్కృష్టతను,విలువలను తెలియచేయడానికి గుడిపాటి వంటి వారి విలువగల హరికథకులను నేటి కథకులు ఆదర్శంగా తీసుకోవాలని అన్నారు. సభానంతరం మోపిదేవి దుర్గా మహాలక్ష్మి భాగవతారిణి చే హనుమత్సందేశం హరికథాగానం హనుమంతుని దాస భక్తిని,ధీ శక్తిని,శక్తి ని చాటుతూ రసభరితంగా సాగింది.

సీతారామచంద్రస్వామి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు

విశాలాంధ్ర-కూచిపూడి : మొవ్వ మండలం పెదపూడిలో సీతారామచంద్రస్వామి దేవాలయ పునఃప్రతిష్ట మహోత్సవాలు బుధవారం వైభవంగా ప్రారంభమైనాయి. మూడు రోజులపాటు జరిగేఈ కార్యక్రమాల్లో పూజా కార్యక్రమాలను ప్రారంభించారు. ఒక వైపు మంగళ వాయిద్యాలు హెూరు మరొకవైపు వేదమంత్రాలు ఘోషల నడుమ వైభవంగా ప్రారంభమైనవి వేడుకలు తిలకించడానికి పలు ప్రాంతాలలో స్థిరపడిన గ్రామస్థులు కుటుంబాలతో రావడంతో గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది. ఈనెల 10న సీతారామ చంద్రస్వామి, గణపతి, చంద్రమ్మ అమ్మవార్లు ధ్వజ, యంత్ర, తిర ప్రతిష్ట మహెూత్సవాన్ని గురుదేవులు కే భాను ప్రసాద్ దివ్య మంగళ శాసనములతో త్రయాహ్నిక దీక్షా పూర్వకంగా త్రిగుండాత్మికంగా గుండెపూడి నాగరాజశేఖర శర్మ బ్రహ్మత్వంలో పలువురు దంపతులు వేడుకలను నిర్వహిస్తున్నారు. గ్రామ ప్రదక్షిణ, గణపతి పూజ, పుణ్యా వచనం యాగశాల ప్రవేశం, మృత్యం గ్రహణము అంకురార్పణ, దర్బార్ సేవ జలాదివాసము నిర్వహించారు.

చంద్రబాబు పాలన కోసం ఎదురు చూస్తున్నారు

విశాలాంధ్ర- చల్లపల్లి : అభివృద్ధి ప్రదాత, భవిష్యత్ తరాల కోసం ఆలోచన చేసే విజనరీ లీడర్ చంద్రబాబు నాయుడు పరిపాలన కోసం ప్రజలు ఎదురు చూస్తున్నారని టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు, బుద్ధప్రసాద్ తనయుడు మండలి వెంకట్రామ్ (రాజా) పేర్కొన్నారు. తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమం చల్లపల్లి మండలం మంగళాపురం గ్రామంలో మంగళవారం సాయంత్రం జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న రాజా దళితవాడలో ఇంటింటికీ తిరుగుతూ ప్రజలను పలకరించి వారి సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రాజా మాట్లాడుతూ, వైసీపీ పాలనలో గ్రామాల్లో అభివృద్ధి శూన్యమన్నారు. పంచాయతీల నిధులను సైతం దారి మళ్లించిన ఘనత రాష్ట్ర ప్రభుత్వానిదన్నారు. రాష్ట్రంలో యువతకు భవిత లేకుండా పోయిందని తెలిపారు. ప్రజలు అనేక సమస్యలను తెలియచేస్తున్నారనీ, ప్రధానంగా రహదారులు, డ్రైనేజీ సమస్యలు ఉన్నాయన్నారు. ధరల పెరుగుదల, ఛార్జీల పెంపుతో ప్రజలు సతమతమవుతున్నారని తెలిపారు. టీడీపీ హయాంలో గ్రామాల్లో సీసీ రోడ్ల నిర్మాణం చేపట్టి అనేక రహదారుల నిర్మాణాలకు నిధులు మంజూరు చేశారనీ, వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఆ పనులను అన్నింటినీ రద్దుచేసిందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీలు మోర్ల రాంబాబు, పిట్టు వెంకటేశ్వరమ్మ, చల్లపల్లి సర్పంచ్ పైడిపాముల కృష్ణకుమారి, ఎంపీటీసీ పైడిపాముల స్వప్న, ఉపసర్పంచ్ కొల్లూరి పల్లవి, టీడీపీ నేతలు నిడమానూరి దిలీప్ కుమార్, రావి చిట్టి, చంద్ర వెంకటేశ్వరరావు, పరుచూరి కమలాకరరావు, రావెళ్ల విజయ్, మోర్ల ప్రసాద్, కనకదుర్గ, భాగ్యారావు, నాగబాబు, క్లస్టర్ ఇన్చార్జిలు మోర్ల శివ, మల్లంపల్లి శివరామకృష్ణ తదితరులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

విశాలాంధ్ర
ఎన్టీఆర్ జిల్లా

ఓటర్ కార్డుకు ఆధార్ అనుసందానంలో

రాజకీయపార్టీలదే కీలక పాత్ర

బూత్ లెవల్ అధికారి పార్టీ ఏజెంట్ల సమన్వయంతో అనుసందాన ప్రక్రియ పూర్తి చేద్దాం.. జిల్లా కలెక్టర్ డిల్లీరావు

విశాలాంధ్ర-విజయవాడ : ఓటర్ కార్డుకు ఆధార్ అనుసంధాన ప్రక్రియ పూర్తి చేసేందుకు రాజకీయపార్టీల పాత్ర కీలకమని బూత్ లెవల్ అధికారి, రాజకీయపార్టీల ఏజెంట్ల సమన్వయంతో ప్రక్రియ పూర్తి చేసేందుకు సహకరించాలని జిల్లా కలెక్టర్ ఎస్ డిల్లీరావు రాజకీయ పార్టీ ప్రతినిధులను కోరారు. ఓటర్ కార్డుకు ఆధార్ అనుసందానం పై బుధవారం జిల్లా కలెక్టర్ ఎస్ డిల్లీరావు ఆయన కార్యాలయంలోని వీడియోకాన్ఫరెన్స్ హాల్ నుండి గుర్తింపు పొందిన రాజకీయపార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. సమావేశంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఓటర్ల జాబితాలో ఆధార్ సంఖ్యను లింక్ చేసేందుకు ఎన్నికల సంఘం ఫారం 6 బి ని ప్రవేశపెట్టిందన్నారు. జిల్లాలో ఇప్పటివరకు 16 లక్షల 27 వేల మంది ఓటర్లకు ఆధార్ కార్డులను అనుసంధానం చేయడం జరిగిందన్నారు. మరో 4 లక్షల మంది ఓటర్లకు ఆధార్ అనుసందాన ప్రక్రియను పూర్తి చేయాల న్నారు. మార్చి 2023 నాటికి పూర్తి స్థాయిలో ఆధార్ అనుసందాన ప్రక్రియ పూర్తి చేయాలని కేంద్ర ఎన్నికల సంఘం సూచించడం జరిగిందన్నారు. విజయవాడ నగర పరిధిలోని పశ్చిమ తూర్పు సెంట్రల్ శాసనసభ నియోజకవర్గాల పరిధిలో ఒక్కొక్క నియోజకవర్గంలో దాదాపు లక్ష చొప్పున మూడు లక్షల మంది ఓటర్లకు ఆధార్ అనుసందానం చేయవల్సి వుందని మిగిలిన నాలుగు నియోజకర్గంలో మరో లక్ష మంది ఓటర్లకు ఆధార్ అనుసందానం ప్రక్రియ పూర్తి చేయవలసి ఉంద న్నారు. బూత్ స్థాయి అధికారులతో నెల రోజుల పాటు ఓటర్ అనుసందానంపై ప్రత్యేక డ్రైవ్ నిర్వహించనున్నామని, రాజకీయపార్టీలకు చెందిన బూత్ ఏజెంట్లు ఆధార్ అనుసందానం ప్రక్రియకు సహకారం అందించేలా రాజకీయపార్టీలు కృషి చేయాలని కోరారు. బూత్ లెవల్ అధికారి రాజకీయపార్టీ ఏజెంటు ప్రతి ఇంటిని సందర్శించి ఆధార్ అనుసందానం కాని ఓటర్లను గుర్తించి ఆధార్ అనుసందానం చేసేలా చర్యలు తీసుకోవాలని తద్వారా పారదర్శకమైన ఓటర్ల జాబితాను రూపొందించేందుకు అవకాశం వుంటుందన్నారు. అన్‌లైన్, ఆఫ్‌లైన్‌విధానాలలో ధరఖాస్తు చేసుకోవచ్చునన్నారు. ఫారం 6 ఏ కు సంబంధించి ఎన్ఆర్ఐ ఓటర్ల నమోదు విషయంలో ఎటువంటి మార్పులు లేవన్నారు. ఎన్నికల సంఘం నిర్దేశించిన విధంగా ఓటర్ల జాబితా సవరణలు, ఆధార్ అనుసందానం, 18 సంవత్సరాలు నిండిన యువత ఓటర్లగా నమోదు అయ్యేందుకు నూతన మార్గనిర్దేశకాలపై అవగాహన ఏర్పచుకుని గుర్తుంపు పొందిన రాజకీయపార్టీలు, అధికారులు సమన్వయంతో పారదర్శకమైన ఓటర్ల జాబితా రూపొందించడానికి సహకరించాలని కలెక్టర్ డిల్లీరావు కోరారు. ఈ సందర్భంగా భారత కమ్యూనిస్టు పార్టీ ప్రతినిధి సీహెచ్.కోటేశ్వరరావు మాట్లాడుతూ ఓటర్ కార్డుకు ఆధార్‌ను అనుసంధానించటంపై చాలా మందికి అనుమానాలు ఉన్నాయన్నారు. అనేక మందికి ఆధార్ కార్డులు వారి దగ్గర లేవన్నారు. ఈ నేపథ్యంలో ఓటు హక్కు వినియోగించుకోవటానికి కేంద్ర ఎన్నికల సంఘం నిర్దేశించిన గుర్తింపు కార్డులలో ఏదో ఒక కార్డు అనుసంధానం చేస్తే బాగుంటుందని సూచించారు. ఈ సమవేశంలో డిఆర్వో కె. మోహన్‌కుమార్, వైఎస్సార్ సిపి ప్రతినిధి వై. ఆంజనేయరెడ్డి, తెలుగుదేశపార్టీ ప్రతినిధి సిహెచ్ ఉషారాణి, ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ పార్టీ ప్రతినిధి బి. కిరణ్‌కుమార్, సీపీఎం పార్టీ ప్రతినిధి డి.వి.కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అర్హులైన లబ్ధిదారులకు

తక్షణమే టిడ్కో ఇళ్లు ఇవ్వాలి

ఇళ్ల వ్యయం రూ.5లక్షలకు పెంచాలని డిమాండ్

విశాలాంధ్ర-విజయవాడ (కృష్ణలంక) : అర్హులైన లబ్దిదారులకు తక్షణమే టిడ్కో ఇళ్లు ఇవ్వాలని, ఇళ్ల వ్యయాన్ని రూ.1లక్షా 80వేల నుంచి రూ.5లక్షలకు పెంచాలని సీపీఐ నగర కార్యవర్గ సభ్యులు, 17, 18 డివిజన్‌ల ఇన్‌ఛార్జ్ సంగుల పేరయ్య డిమాండ్ చేశారు. సీపీఐ రాష్ట్ర సమితి పిలుపు మేరకు కృష్ణలంక చలసానినగర్ 18వ డివిజన్‌లోని మిరియాల వారి వీధిలో అర్హులైన లబ్ధిదారులను కలసి టిడ్కో ఇళ్ళు ఇవ్వాలని సీపీఐ పార్టీ పోరాటం చేస్తున్నదని వివరిస్తూ ప్రచారం నిర్వహించారు. దీనిలో భాగంగా సంతకాలు సేకరించారు. టిడ్కో ఇళ్లు కేటాయించిన లబ్ధిదారులకు సీపీఐ అండగా ఉంటుందని వివరిస్తూ ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టిడ్కో ఇళ్ల లబ్ధిదారులకు ఇళ్లు ఇవ్వాలని కోరుతూ ఈ నెల 22వ తేదీన సీపీఐ అధ్వర్యంలో జరిగే మహాధర్నాలో టిడ్కో ఇళ్ళు వచ్చిన వారందరూ పాల్గొనాలన్నారు. టిడ్కో ఇళ్ల లబ్ధిదారులు తమ వాటాగా ప్రభుత్వానికి డబ్బులు చెల్లించి నాలుగేళ్ళు గడుస్తున్నా నేటికీ ఇళ్లు ఇవ్వకపోవటం పాలకులు పేదల పట్ల అవలంబిస్తోన్న నిర్లక్ష్య వైకరికి నిదర్శనమన్నారు. ఈ ప్రభుత్వానికి పేదల సమస్యల పట్ల ఏమాత్రం శ్రద్ధ లేదని, అదే ఉంటే ఈ పాటికి టిడ్కో లబ్ధిదారులకు ఇళ్లు ఇచ్చేదన్నారు. ఏనుగును అంకుశంతో పొడిస్తేకాని మాటవినదని, మొద్దు నిద్ర పోతున్న ఈ ప్రభుత్వాన్ని టిడ్కో గృహ లబ్ధిదారులు అంకుశంతో పొడిస్తేకాని దారిలోకి రాదని వ్యాఖ్యానించారు. అందుకే సీపీఐ ఆధ్వర్యంలో నిర్వహిస్తోన్న మహాధర్నాలో టిడ్కో లబ్ధిదారులు, ప్రజలు పాల్గొని నిరసనను తెలియజేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఐ 18వ డివిజన్ కార్యదర్శి అంబడిపూడి మోహన్‌కుమార్, సహాయ కార్యదర్శి కూరాకుల స్టాలిన్, కోశాధికారి పాశం ఆంజనేయులు, నాయకులు షేక్.నజీర్, ఉస్తేల రాహేల్ బాబు, నడింపల్లి అచ్చిబాబు, మేడెబోయిన వెంగళరావు , మిరియాల బాబు, చుక్కా ఆనంద బాబు తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

13న ఎన్టీఆర్ జిల్లా బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ సమావేశం

విశాలాంధ్ర-విజయవాడ: ఎన్టీఆర్ జిల్లా బిల్డింగ్ అండ్ కన్స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ విస్తృత సమావేశము 13వ తేదీ సోమవారం ఉదయం 10 గంటలకు హనుమాన్ పేటలోని యూనియన్ కార్యాలయంలో జరుగుతుందని జిల్లా అధ్యక్ష కార్యదర్శులు నీలకంఠ ప్రసాద్, ఎస్‌కే.ఉమర్ వలి బుధవారం ఒక ప్రటనలో తెలిపారు. ఈ సమావేశానికి రాష్ట్ర ఏఐటీయూసీ డిప్యూటీ ప్రధాన కార్యదర్శి ఎస్. వెంకటసుబ్బయ్య యూనియన్ గౌరవ అధ్యక్షులు పల్లా సూర్యరావు, విజయవాడ నగర ఏఐటియుసి ప్రధాన కార్యదర్శి మూలి సాంబశివరావు, డిప్యూటీ కార్యదర్శి సిహెచ్.వి.రమణ హాజరవుతున్నారని పేర్కొన్నారు. కావున జిల్లా లోని మండలాల అధ్యక్ష కార్యదర్శులు, బాధ్యులు, కార్మికులు సమావేశానికి సకాలంలో హాజరుకావాలని కోరారు. ఈ సమావేశంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు భవన నిర్మాణ కార్మికుల పట్ల అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలపైన, సంక్షేమ బోర్డు లోని డబ్బులను రాష్ట్ర ప్రభుత్వం వారి సొంత ప్రయోజనాలకు వాడుకొని బోర్డును నిర్వీర్యం చేయటంపై, నిర్మాణ కార్మికుల కుటుంబాలు ఎదుర్కొంటున్న సమస్యలు, వెంటనే బోర్డు పునరుద్దించుటకు తగిన చర్యలు తీసుకోవాలనే డిమాండ్‌లపై చర్చించి భవిష్యత్ కార్యాచరణ రూపొందించటం జరుగుతుందని వివరించారు.

వ్యభిచార గృహం పై పోలీసులు దాడి

విశాలాంధ్ర-విజయవాడ క్రైం: విజయవాడ పటమట పోలీస్‌స్టేషన్ పరిధిలో జనావాసల మధ్య నిర్వహిస్తున్న వ్యభిచార గృహం పై సీఐ కాశీవిశ్వనాథ్ తన సిబ్బందితో దాడులు చేశారు. రామచంద్రనగర్‌లో ఓ అపార్ట్‌మెంట్‌లో ఓ ఇంటిని అద్దెకు తీసుకుని నిర్వహకుడు ఈ వ్యాపారం నిర్వహిస్తోన్నాడు. ఇతర ప్రాంతాల నుంచి అమ్మాయిలను తీసుకువచ్చి గట్టుగా వ్యభిచారం నిర్వహిస్తున్నారు. ఇటీవల కాలంలో ఆ ఇంటికి యువకులు వచ్చిపోవటం ఎక్కువ అవటంతో అనుమానం వచ్చి పోలీసులకు పోలీసులకు సమాచారం అందింది. పోలీసులు ఇంటి పై దాడి చేసి ఒక నిర్వాహకుడు, ఇద్దరు విటులు, ముగ్గరు అమ్మాయిలను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.

జుజ్జూరు మండల కేంద్రంగా క్యాబినెట్ తీర్మానంపై సంబరాలు

విశాలాంధ్ర-వీరులపాడు: మండల కేంద్రాన్ని వీరుపాడు గ్రామం నుండి జుజ్జూరు గ్రామానికి తరలిస్తూ బుధవారం మంత్రివర్గ ఆమోదం పొందడంతో ఎన్నో సంవత్సరాల కల సాకారం అయ్యిందంటూ జుజ్జూరు గ్రామ ప్రజలు సంబరాలు చేసుకున్నారు. తీన్మార్ డబ్బులు, టపాసులతో గ్రామం మారుమోగిపోయింది. బుధవారం నిర్వహించిన ఈ సంబరాల్లో ఎమ్మెల్సీ మొండితోక అరుణ్ కుమార్ పాల్గొన్నారు. గ్రామంలో ఉన్న అంబేడ్కర్, వైయస్సార్, విగ్రహాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం అరుణ్ కుమార్ మాట్లాడుతూ మండల కేంద్రాన్ని తరలించే ప్రక్రియలో వీరులపాడు నాయకులకు గాని, వీరులపాడు ప్రజలకు గాని వ్యతిరేకం కాదని కానీ మండల కేంద్రం అనేది మండలానికి మధ్యలో ఉంటే అందరికీ న్యాయం జరుగుతుందని ఈ నిర్ణయం తీసుకున్నామని అన్నారు.1984 లోనే గెజిట్ లో మండల కేంద్రం జుజ్జూరు అని ఉందని, కొంతమంది స్వార్థ ప్రయోజనాల కోసం మండల కేంద్రాన్ని మార్పు చేశారని అన్నారు. మండల కేంద్రం దూరంగా ఉండటం వలన ఉద్యోగస్తులు ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. జుజ్జూరు మండలం కావాలనే ఆకాంక్షను మొండి పట్టుదలతో నెరవేర్చిన మొండితోక బ్రదర్స్ కు జుజ్జూరు గ్రామ ప్రజలు ఎప్పటికీ రుణపడి ఉంటారని గ్రామస్తులు పేర్కొన్నారు. మండల కేంద్రంగా జుజ్జూరు అభివృద్ధికి ఇప్పటివరకు వీరులపాడు కు మిగిలిన గ్రామాలు ఏ విధంగా సహాయ సహకారాలు అందించారో ఇకనుండి జుజ్జూరు గ్రామ అభివృద్ధికి అదేవిధంగా తోడ్పాటు ఇవ్వాలని ఆకాంక్షించారు.

55వ రోజుకు రిలే నిరాహార దీక్షలు

విశాలాంధ్ర-వీరులపాడు: మండల కేంద్రాన్ని వీరులపాడులోని కొనసాగించాలని డిమాండ్ చేస్తూ 55వ రోజు రిలే నిరాహార దీక్షలో వీరులపాడు గ్రామస్తులు. గుడిస శ్రీనివాసరావు,పొందుగల వెంకట్రావు, వట్టి కొండ చంద్రం, లంక రాజశేఖర్, వెంకటేశ్వర్లు బుధవారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండల కేంద్రం తరలింపు నిర్ణయం ప్రభుత్వం వెనక్కి తీసుకునే వరకు తమ నిరసనను రోజు రోజుకి ఉదృతం చేస్తామని తెలిపారు.

బీఎస్ఎన్ఎల్ విశ్రాంత ఉద్యోగులకు పెన్షనర్స్‌కు రివిజన్ చేయాలి

విశాలాంధ్ర-విజయవాడ : బీఎస్ఎన్ఎల్ విశ్రాంత ఉద్యోగులకు పెన్షన్ రివిజన్ చేయాలని డిమాండ్ చేస్తూ బీఎస్ఎన్ఎల్ పెన్షనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ నిర్వహించారు. మహాత్మగాంధీ రోడ్డులో బుధవారం ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి వి.వరప్రసాద్ మాట్లాడుతూ 2017 జనవరి ఒకటో తేది నుంచి పెన్షన్ రివిజన్ చేయాల్సి ఉన్నా ప్రభుత్వం ఇప్పటి వరకు పట్టించుకోలేదన్నారు. ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరిని తీవ్రంగా ఖండించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ఏపీ సర్కిల్ అధ్యక్షులు కె.ఎస్.కోటేశ్వరరావు, సర్కిల్ ముఖ్య సలహాదారులు ఎం.ఆర్. ప్రకాశరావు, కార్యదర్శి డి.వెంకటేశ్వరరావు, కృష్ణాజిల్లా కార్యదర్శి సి.భాస్కరరావు, పాల్గొన్నారు. ర్యాలీ అనంతరం పెన్షన్ పేమెంట్ అథారిటీ (సీసీఏ)కు వినతి పత్రం అందజేశారు.

ఇంజనీరింగ్ పనుల అవకతవకలపై కొండపల్లి మున్సిపల్ అధికారులపై విచారణకు ఆదేశాలు

విశాలాంధ్ర-ఇబ్రహీంపట్నం : కొండపల్లి మున్సిపల్ కమిషనర్ పర్వతనేని శ్రీధర్, సాయి గణేష్ పై ఇంజనీరింగ్ ఇన్ చీఫ్ (పి హెచ్) పి. ఆనందరావు బుధవారం విచారణకు ఆదేశించారు. హైకోర్టు న్యాయవాది ఆకునూరి రామకృష్ణ కొండపల్లి మున్సిపాలిటీలో పరిధిలో జరిగిన ఇంజనీరింగ్ పనుల్లో అవకతవకలు జరిగాయని, విచారించి చర్యలు తీసుకోవాలని చేసిన ఫిర్యాదు మేరకు ఆదేశాలు జారీ చేశారు. ఫిర్యాదుకు స్పందించిన ఇంజనీరింగ్ చీఫ్, ప్రధాన కార్యాలయం, పబ్లిక్ హెల్త్ తాడేపల్లి, గుంటూరు పేరిట ఉన్నతాధికారి ఆనందరావు ఉత్తర్వులు జారీ చేశారు.

కొండపల్లి మున్సిపల్ కమిషనర్‌గా సీహెచ్ వెంకటేశ్వర్లు

విశాలాంధ్ర-ఇబ్రహీంపట్నం : కొండపల్లి మున్సిపల్ కమిషనర్ గా సిహెచ్ వెంకటేశ్వర్లు నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర మున్సిపల్ కమిషనర్ డైరెక్టర్ ప్రవీణ్ కుమార్ బుధవారం ఆదేశాలు జారీ చేశారు. ఇప్పటివరకు ఇక్కడ పనిచేస్తున్న పర్వతనేని శ్రీధర్ పిడుగురాళ్ల మున్సిపాలిటీ రెవెన్యూ అధికారిగా బదిలీ అయ్యారు. కొత్తగా బాధ్యతలు స్వీకరించే వెంకటేశ్వర్లు చీరాల మున్సిపాలిటీలో మేనేజర్‌గా పని చేస్తున్నారు. ఇకపై ఆయన మున్సిపాలిటీకి పూర్తిస్థాయి కమిషనర్‌గా బాధ్యతలు నిర్వర్తించనున్నారు.

పెట్రోల్ బంక్‌ల తనిఖీ

విశాలాంధ్ర-పెనుగంచిప్రోలు : మండలం లోనిపెట్రోల్ బంక్ లను అనగా పెనుగంచిప్రోలు, కొనకంచి పెట్రోల్ బంక్ లను బుధవారం తనిఖీ చేసిన లీగల్ మెట్రాలజీ అసిస్టెంట్ కంట్రోలర్. బి. కుమారి.మండల తహసిల్దార్ కోట.లక్ష్మి కల్యాణి, పి డి ఎస్ డిటి రామమూర్తి రెడ్డి, ఆర్. ఐ.డి జనార్దన్ రావు, విఆర్ఓ లక్ష్మి. చై త న్య.లుతదితరులు పాల్గొన్నారు.

మత్తుతో జీవితానికి ముప్పు

విశాలాంధ్ర-విజయవాడ క్రైం: మత్తుతో యువత జీవితానికి పెనుముప్పు వాటిల్లుతుందని దిశ పోలీసుస్టేషన్ ఎస్ఐ కే పూర్ణిమరమణీ అన్నారు. కాకరపర్తి భావనారాయణ కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగాలు, నవజీవన్ బాలభవన్, సచివాలయం మహిళా పోలీసు విభాగాల ఆధ్వర్యంలో మత్తు పదార్థాల వలన యువతకు కలిగే అనర్థాలపై అవగాహనా కార్యక్రమాన్ని కళాశాల సెమినార్ హాల్‌లో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ పూర్ణిమ రమణీ మాట్లాడుతూ యువత ఏ మాత్రం తప్పటడుగులు వేసినా జీవితాన్ని కోల్పోతారన్నారు. యువతలకు ఎటువంటి ఇబ్బందులెదురైనా దిశా యాప్‌ను వినియోగించుకొని రక్షణ పొందాలన్నారు. స్మార్ట్‌ఫోన్లు, సోషల్ మీడియాలను అవసరానికి మాత్రమే వినియోగించుకోవాలన్నారు. వాటి వలన అనేక ఇబ్బందులెదురవుతాయని ఉదాహరణలను వివరించారు. క్లినికల్ సైకాలజిస్ట్ డాక్టర్ షీలానికోలస్ మాట్లాడుతూ మత్తు అనేక రూపాల్లో యువతకు లభిస్తుందన్నారు. యువత తమ జీవితానికి అత్యుత్తమమైన లక్ష్యాన్ని ఏర్పరచుకొని ముందుకు సాగాలన్నారు. మత్తు వలన కలిగే ఇబ్బందులు కుటుంబాన్ని, సమాజాన్ని ఏ విధంగా ప్రభావితం చేస్తాయో వివరించారు. కార్యక్రమంలో ఎస్ఐ సుబ్బారావు, నవజీవన్ బాలభవన్ సైకాలజిస్ట్ అనూష, సచివాలయం మహిళా పోలీసులు సిహెచ్ సంఘవి, బీ వినీత తదితరులు మాట్లాడారు. ఎన్ఎస్ఎస్ పీవో వీ శేషగిరిరావు, పవన్‌కుమార్, ఎన్ సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రకటన

ఇందుమూలముగా తెలియజేయునది ఏమనగా జగ్గయ్యపేట పట్టణం కొత్తగుంటపాలెం నివాసిని అయిన **పూసాల పుల్లారావు తండ్రి జగన్మోహన్‌రావు** అను నేను జగ్గయ్యపేట పట్టణములో గల హెచ్.డి.ఎఫ్.సి. బ్యాంకు నందు నా ఫరమ్ "శ్రీ రాజ్యలక్ష్మి రోడ్డు క్యారియర్స్" అను పేరు మీద ఎకౌంటు కలిగి ఉన్నాను. ఎకౌంటు నెం. **23678130000016**, చెక్కు నెం. **000768** ఈ నెంబరు కలిగిన చెక్కు నా ఆఫీసులో **తేది.5.2.2023**న మధ్యాహ్నం నుండి కనిపించుట లేదు. సాయంత్రం వరకు వెతికినాను కాని కనిపించలేదు. ది.6.2.2023 న హెచ్.డి. ఎఫ్.సి. బ్యాంకునకు వెళ్ళి పై నెంబరు గల చెక్కు కనిపించుట లేదు. ఈ చెక్కు ద్వారా బ్యాంకు లో ఎటువంటి లావాదేవీలు జరుపకూడదు అని బ్యాంకు వారికి తెలియజేసి ఉన్నాను. కావున పై చెక్కు ఎవరికైనా లభించినచో ఈ క్రింది అడ్రస్సుకు అందజేయగలరు అని మనవి.

పూసాల పుల్లారావు
కొత్తగుంటపాలెం, 4వ లైను, ఫోన్ నెం.9949400377

Union Bank of India — యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా
లోటస్ ల్యాండ్ మార్క్ బ్రాంచి, విజయవాడ - 520003.

బంగారు నగల వేలం ప్రకటన

ఈ క్రింది ఉదహరించిన ఖాతాదారులు మా బ్యాంకు నందు బంగారు నగలు తనఖా పెట్టి అప్పు తీసుకొని తిరిగి చెల్లించమని నోటీసులు పంపినను తిరిగి చెల్లించని కారణంగా బ్యాంకు నిబంధనల ప్రకారం ది. **28-02-2023, మంగళవారం సా॥ 4.00 గంటలకు బ్రాంచి ఆవరణలో బహిరంగవేలం వేయబడును.** వేలం వేసినా బకాయి రద్దు కాని యెడల వారిపై చట్టరీత్యా తగు చర్యలు తీసుకొని మిగిలిన బకాయి వసూలు చేయబడును. ఈ దిగువ ఖాతాదారు ఎవరైనా మరణించిన యెడల వారి వారసులకు ఈ వేలం నోటీసు వర్తిస్తుంది. అప్పు నోటీసులు అందని వారికి మరియు నోటీసులను తిరస్కరించిన వారికి పత్రికా ముఖమునే చివరిసారిగా ఈ నోటీసు ద్వారా తెలియజేయడమైనది.

వ. సం.	ఖాతా నెం.	ఋణగ్రహీత పేరు	స్థూల బరువు (గ్రాములలో)
1.	222016530000219	శ్రీమతి ఐ. నాగ మాలతి, భర్త:శ్రీ. సురేష్ గౌడ్, 18-10-1/20, 8వ లైన్, కేదారేశ్వరపేట, విజయవాడ-520003	19.0

షరతులు : 1) వేలంలో పాల్గొనువారు **రూ. 5,000/- (అక్షరాల ఐదు వేల రూపాయలు మాత్రమే)** ధరావత్తు చెల్లించవలెను. **2)** వేలంలో ఆభరణములు పొందినవారు ధరావత్తు సొమ్ము మినహా మిగిలిన సొమ్మును వెంటనే చెల్లించి ఆభరణములను పొందవలెను. వేలంలో ఆభరణములు పొందని వారికి ధరావత్తు సొమ్ము వేలం అనంతరం తిరిగి చెల్లించబడును. **3)** ఏ స్థితిలోనైనా వేలం నిలుపుదల చేయుటకు గాని, నియమ నిబంధనలు మార్చుటకు గాని బ్యాంకు వారికి పూర్తి అధికారం కలదు. **4)** వేలంలో పాడిన సొమ్మును అంగీకరించుటకు లేక తిరస్కరించుటకు బ్యాంకు వారికి పూర్తి అధికారం కలదు. **5)** వేలంలో పాల్గొను వారు ఆధార్ మరియు పాన్‌కార్డుల కాపీలను సమకూర్చవలెను.

ది. 08-02-2023 సం/- అధీకృత అధికారి

12న విజయవాడలో రాష్ట్ర స్థాయి రైతు గర్జన సదస్సు

విశాలాంధ్ర-విజయవాడ : స్వామినాథన్ సిఫార్సుల అమలు, మద్దతు ధరల గ్యారంటీ చట్టం, విద్యుత్ బిల్లు-2022 రద్దు, స్మార్ట్ మీటర్ల ఏర్పాటు ఉపసంహరణ, కేరళ తరహా రుణ విమోచన చట్టం, ఒక్క పర్యాయం రైతాంగ అప్పుల రద్దు, వ్యవసాయ అనుబంధ రంగాలకు కేంద్ర, రాష్ట్ర బడ్జెట్‌లలో నిధుల పెంపు, పోలవరం ప్రాజెక్టు, రాజధాని అమరావతికి నిధుల పెంపు కోరుతూ రైతు సంఘాల సమన్వయ సమితి ఆధ్వర్యంలో ఫిబ్రవరి 12వ తేది రాష్ట్ర స్థాయి రైతు గర్జన సదస్సు నిర్వహించనున్నట్లు ఏపీ రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి మర్నేడీ యలమందారావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం మధ్యాహ్నం 3 గంటలకు విజయవాడ హనుమాన్‌పేట లోని దాసరి భవన్‌లో ఈ కార్యక్రమం జరుగుతుందని పేర్కొన్నారు. మాజీ వ్యవసాయశాఖా మంత్రి వడ్డె శోభనాద్రీశ్వరరావు అధ్యక్షతన జరిగే ఈ సదస్సులో కిసాన్ సంయుక్త మోర్చా జాతీయ నాయకులు రాకేష్ తికాయిత్, సుప్రీంకోర్టు విశ్రాంత న్యాయమూర్తి గోపాల్ గౌడ్, అఖిల భారత కిసాన్ సభ అధ్యక్షులు రావుల వెంకయ్య, అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం కార్యదర్శి బి.వెంకట్ ప్రధాన వక్తలుగా పాల్గొంటారని పేర్కొన్నారు.

రేపు కేంద్రప్రభుత్వ కార్యాలయాల వద్ద నిరసన జయప్రదం చేయండి

విశాలాంధ్ర-విజయవాడ : కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రజావ్యతిరేక, అదాని అనుకూల బడ్జెట్‌కు వ్యతిరేకంగా ఫిబ్రవరి 10వ తేది శుక్రవారం ఉదయం 10 గంటలకు ఎన్టీఆర్ జిల్లాలోని అన్ని నియోజకవర్గాలు, మండల కేంద్రాలలో ఉన్న పోస్టాఫీసులు, టెలిఫోన్ ఎక్స్చేంజ్‌లు, బ్యాంకుల ఎదుట సీపీఐ ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శనలు నిర్వహించ నున్నట్లు సీపీఐ ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి సీహెచ్. కోటేశ్వరరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పార్టీ శ్రేణులు, పెద్ద సంఖ్యలో పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

జింకు లోపం నివారణ పై శిక్షణ

విశాలాంధ్ర-తిరువూరు: మండలంలోని మునుకుళ్ళ లో మేలైన సాగు పద్ధతులపై వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో బుధవారం పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. వరి పొలాల్లో జింకు లోపం కారణంగా ఎదుగుదల లోపించిందని తిరువూరు సహాయ వ్యవసాయ సంచాలకులు జీ కెనడి తెలిపారు. జింకులోపం ఉన్న పొలాల్లో ఆకుల మధ్య ఈనెలు పాలిపోవడం, నాటిన రెండు నుంచి నాలుగు వారాల్లో ముదరాకు చివర్లలో మధ్య ఈనెకు ఇరువక్కల తుప్పు లేక ఇటుక రంగు మచ్చలు కనబడతాయని ఎడిఏ సూచించారు. ఆకులు చిన్నవిగా పెళుసుగా ఉండి విరిగిపోతాయని, ఈ లక్షణాలు గమనించిన వెంటనే లీటర్ నీటికి రెండు గ్రాముల జింకు సల్ఫేట్ ను 5 నుంచి ఏడు రోజుల వ్యవధిలో రెండుసార్లు పిచికారి చేయాలని సూచించారు. ఏవో పద్మ రైతు భరోసా కేంద్ర సిబ్బంది రైతులు పాల్గొన్నారు.

న్యాయవాదిపై హత్యాయత్నం - నిరసనగా న్యాయవాదులు విధులు బహిష్కరణ

విశాలాంధ్ర-మైలవరం: కర్నూలు జిల్లా డోన్ బార్ అసోసియేషన్ కోశాధికారి న్యాయవాది పులి దామోదరపై కొంతమంది దుండగులు దాడి చేసి హత్య ప్రయత్నం చేయడాని నిరసిస్తూ మైలవరం బార్ అసోసియేషన్ న్యాయవాదులు బుధవారం తమ విధులను బహిష్కరించి నిరసన తెలిపారు న్యాయవాది పులి దామోదర్ డోన్ పట్టణంలో జరుగుతున్న మెడికల్ మాఫియా పై ఆర్టిఐ ద్వారా సమాచారం సేకరించడానికి అర్జీ దాఖలు చేసిన విషయం దీనిని ఆసరాగా తీసుకొని మెడికల్ మాఫియా గతంలో ఒకసారి దాడి చేసి తీవ్రంగా గాయపరచడం మరల సోమవారం ఉదయం దామోదర్ పై దాడి చేసి అత్యా ప్రయత్నానికి పూనుకోవడం దారుణమని దుండగులను వెంటనే అరెస్టు చేసి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని పార్లమెంట్ సమావేశాల్లోనే న్యాయవాదులు రక్షణ చట్టాన్ని తక్షణమే తీసుకువచ్చే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మైలవరం బార్ అసోసియేషన్ అధ్యక్షులు ముల్లంగి రవికుమార్ సీనియర్ న్యాయవాదులు పివి శేషగిరిరావు ఎస్ వి కే సత్యనారాయణ రావు బుద్ధవరపు వెంకట్రావు వీటి కిషోర్ ఎడి ప్రసాద్ కార్యదర్శి ఎం శరత్ బాబు సహాయ కార్యదర్శి పి రాము పి రవి కిషోర్ ఎం తనూజ్ పాల్గొన్నారు.

నందిగామకు 100 పడకల ఆసుపత్రి మంజూరు

విశాలాంధ్ర-నందిగామ:నందిగామలో గతంలో 50 పడకల ఆసుపత్రి అనుమతులు రాగా ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్ మోహన్ రావు,ఎమ్మెల్సీ మొండితోక అరుణ్ కుమార్ ల 100 పడకల ఆసుపత్రికి రూ.34.48 కోట్లు మంజూరు మరియు ఆసుపత్రిలో 54 పోస్టుల భర్తీకి మంత్రిమండలి ఆమోదం లభించడంతో నియోజకవర్గ ప్రజలు ఆనందం వ్యక్తం చేశారు.అనుకున్నది సాధించిన మొండితోక బ్రదర్స్ అంటూ వైఎస్ఆర్ నాయకులు,కార్యకర్తలు నందిగామ లో సంబరాలు నిర్వహించారు.

మారెమ్మకు రూ.8లక్షల ఆదాయం

విశాలాంధ్ర-విస్సన్నపేట టౌన్: పుట్రేల మారెమ్మ అమ్మవారి దేవాలయ హుండీ లెక్కింపు కార్యక్రమాన్ని దేవాదాయశాఖ అధికారులు సిబ్బంది బుధవారం నిర్వహించారు. గత 71రోజులకు ఆలయానికి హుండీల ద్వారా రూ.8,87,413ల ఆదాయం లభించినట్లు దేవాలయ కార్యనిర్వహణాధికారి ఎ.శ్రీనివాసరావు తెలిపారు. దేవాలయ పాలకవర్గ ఛైర్మన్ కోటగిరి వెంకట సత్య శేష సునీల్, పలువురు కార్యవర్గ సిబ్బంది, దేవాదాయ, ధర్మాదాయశాఖ గన్నవరం డివిజన్ అధికారులు పాల్గొన్నారు.

చిన్న నాగమ్మ కుటుంబాలకు ఆర్ధిక సాయం అందజేత

విశాలాంధ్ర-ఎ.కొండూరు : మండలంలోని రేపూడి గ్రామానికి చెందిన కొప్పుల చిన్న ఇటీవల గుండెపోటుతో మృతిచెందగా ఆ కుటుంబానికి తిరువూరు ఏఎంసి మాజీ ఛైర్మన్ అలవాల రమేష్ రెడ్డి బుధవారం రూ. 5వేల ఆర్థిక సహాయంగా అందజేశారు. అలానే అదే గ్రామానికి చెందిన లాకావతు నాగమ్మ ఆరోగ్యరీత్య బాధపడుతుండగా మానవతాదృక్పథంతో ఆలోచించి ఆ కుటుంబానికి కూడా రూ. 5వేలు ఆర్థిక సాయం అందజేశారు. ఈ సందర్భంగా రమేష్ రెడ్డి మాట్లాడుతూ అధికార పార్టీకి చెందిన నాయకులు పట్టించుకోకపోయినప్పటికీ బాధిత కుటుంబాలకు తెలుగుదేశం పార్టీ అండగా ఉందని, ఆపదలో ఉన్న వారికి ఆదుకోటమే తన జీవిత లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమంలో తరిగొప్పల హుస్సేన్, వార్డు సభ్యులు కొప్పుల వెంకటేశ్వరరావు, చిట్టిబోతులు వెంకటేశ్వరరావు, బొజ్జ గాని కిట్టు, టిడిపి నాయకులు పాల్గొన్నారు.

వైసీపీ నాయకులు బెదిరింపులు సీపీ దృష్టికి

పోలీసు కమిషనర్‌ను కలిసిన ఎమ్మెల్యే గద్దె, మాజీ ఎమ్మెల్సీ బుద్దా

విశాలాంధ్ర-విజయవాడ కార్పొరేషన్ : ప్రజా వ్యతిరేక పాలనతో విసిగిపోయిన వైసీపీ కార్యకర్తలు, నాయకులు టీడీపీలో చేరాలను కుంటున్న నేపథ్యంలో వారిపై వైసీపీ నాయకులు బెదిరింపులకు పాల్పడుతున్న వారిపై చర్యలు తీసుకుని వారికి రక్షణ కల్పించాలని ఎమ్మెల్యే గద్దె రామమోహన్‌రావు, మాజీ ఎమ్మెల్సీ బుద్దా వెంకన్న నగర పోలీసు కమిషనర్‌ను కోరారు. వైసీపీ నుంచి టీడీపీలో చేరే వారిపై వైసీపీ నాయకులు చేస్తున్న బెదిరింపులపై గద్దె రామమోహన్, బుద్దా వెంకన్న బుధవారం కమిషనర్‌ను కలిసి వివరించారు. ఈ సందర్భంగా వారు మీడియాతో మాట్లాడుతూ గతంలో ఉన్న సంస్కృతిని పునరావృతం చేసి ప్రజలను భయభ్రాంతులకు గురిచేసి లబ్ధి పొందాలని చూస్తున్నారన్నారు. ఈ నేపథ్యంలో వైసీపీ నుంచి టీడీపీలో చేరాలను కుంటున్న ఆ పార్టీ నాయకులు గోగుల రమేష్‌పై బెదిరింపులు, కేసులకు పాల్పడుతున్నారని తెలిపారు. గత ఎన్నికల్లో ఇండిపెండెంట్‌గా పోటీచేసిన చెప్పుకోదగ్గ సంఖ్యలో ఓట్లు సాధించిన రమేష్ వైసీపీ నుంచి టీడీపీలోకి వెళితే వైసీపీకి నష్టం వాటిల్లుతుందనే దురుద్దేశ్యంతో గోగుల రమేష్ తనను హత్య చేయాలని చూస్తున్నాడంటూ అరవ సత్యం పోలీసులకు ఫోన్ ద్వారా చెప్పి రమేష్‌ను ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారన్నారు. నగర ప్రజలకు అరవ సత్యం చరిత్ర, గోగుల రమేష్ చరిత్ర గురించి ఎంతో తెలుసని, హత్యా చరిత్ర కలిగిన అరవ సత్యం గోగుల రమేష్ ఏదో చేసేందుకు సినిమాల్లో మాదిరిగా ఉందని, పోలీసులను తప్పుదారి పట్టించి రమేష్‌ను ఇబ్బంది పెట్టాలని చూస్తున్నారన్నారు. రాణిగారితోటలో గడపగడపకు వైసీపీ కార్యక్రమంలో ప్రశ్నించిన మహిళలపై వైసీపీ నాయకులు చేసిన దాడులు తదితర సమస్యలను సీపీకి వివరించినట్లు తెలిపారు. వంగవీటి రాధా నేతృత్వంలో చంద్రబాబు సమక్షంలో గోగుల రమేష్ టీడీపీలో చేరబోతున్నారని రమేష్‌కు టీడీపీ అండగా ఉంటుందని తెలిపారు. వచ్చే శుక్రవారం గోగుల రమేష్ టీడీపలో చేరనున్నట్లు తెలిపారు.

నేటి నుంచి గుణదలమాత మహోత్సవాలు

విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్): తొమ్మిదిరోజులుగా గుణదల కొండపై జరుగుతున్న గుణదలమాత మహోత్సవాల నవదిన ప్రార్థనలు బుధవారం రాత్రితో ఘనంగా ముగిశాయి. చివరిరోజు నవదిన ప్రార్థనలకు విజయవాడ కథోలికపీఠం మోన్సిన్యోర్ సెయింట్ పాల్స్ కథెడ్రల్ విచారణ కర్తలు ఫాదర్ మువ్వల ప్రసాద్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన కొండపై మరియమాత వద్ద భక్తులకు నవదిన ప్రార్థనల ముగింపు సందేశమిచ్చారు. దేవునితల్లి మరియమాత అనేక ప్రాంతాలలో వివిధ పేర్లతో భక్తులకు దర్శనమిచ్చిందని తెలిపారు. ఫ్రాన్సు దేశంలోని లూరునగర్ లో లూర్దుమాతగా, తమిళ్నడులోని నాగపట్నంలో వేళాంకణిమాతగా, గుణదలలోని గుణదలమాతగా ఇంకా పలుప్రాంతాలలో ఆరోగ్యమాతగా, మేరిమాతగా దర్శనమిచ్చిందని పేర్కొన్నారు. గుణదలమాత నవదిన ప్రార్థలనకు అనేక ప్రాంతాల నుండి వచ్చిన భక్తులు ఆ తల్లిని దర్శించి అనేక మేలులు పొందుతున్నారని తెలిపారు. గుణదలమాత పుణ్యక్షేత్రం రెక్టర్ ఫాదర్ యేలేటి విలియం జయరాజు మాట్లాడుతూ గురువారం ఉదయం 7 గంటలకు బిషప్ గ్రాసి హైస్కూల్ గ్రౌండ్లో నూతనంగా నిర్మించిన ఆధ్యాత్మిక కళావేదిక వద్ద బిషప్ తెలగతోటి జోసఫ్ రాజారావు, గుణదల మాత మహోత్సవాలు లాంఛంగా ప్రారంభిస్తారని తెలిపారు. అంతకు ముందు విజయవాడ కతోలికపీఠం బిషప్ తెలగతోటి జోసఫ్ రాజారావు, మోన్సిగ్నోర్ మువ్వల ప్రసాద్, పుణ్యక్షేత్రం రెక్టర్ యేలేటి విలియం జయరాజు, సోషల్ సర్వీస్ సెంటర్ డైరెక్టర్ ఫాదర్ తోట సునీల్ రాజు, వికార్ జనరల్ ఫాదర్ యం. గాబ్రియేలు, ఫాదర్ కొలకాని మరియన్న గురువులు 'దివ్యసత్ప్రసాద మందసంతో" కొండపై మరియమాత వద్దకు చేరుకున్నారు. అనంతరం మోన్సిన్యోర్ మువ్వల ప్రసాద్ తదితర గురువులతో కలిసి 'సమిష్టి దివ్యపూజాబలి' సమర్పించారు. సెయింట్ పాల్స్ కథెడ్రల్, పెద్ద ముస్తాబాద్, కేశరపల్లి విచారణల నుండి వచ్చిన భక్తులు కుటుంబ, వివాహ వ్యవస్థలు పటిష్టంగా ఉండాలని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ కార్యక్రమంలో పుణ్యక్షేత్రం రెక్టర్ యేలేటి విలియం జయరాజు, ఫాదర్ తోట సునీల్ రాజు, తెలగతోటి పాల్ (జర్మనీ), ఫాదర్ ఎన్. దేవిడ్ రాజు, ఫాదర్ కొలకాని మరియన్న, ఫాదర్ పసల తోమస్, ఫాదర్ మెరుగుమాల చిన్నప్ప తదితర గురువులు, సిస్టర్స్ పాల్గొన్నారు.

IN THE COURT OF THE HONOURABLE SENIOR CIVIL JUDGE AT GANNAVARAM.
O.S. No. 25/2022.

Between:
Pinnamaneni Swarna Kumari - Plaintiff
AND
Machineni Koteswara Rao and another. - Defendants.

Defendant No. 1 : Machineni Koteswara Rao, S/o. Venkataratnam, Hindu, aged about 50 yrs., R/o. D.No.48-4-15A, Ashok Gardens, Gunadala, Vijayawada-4.

పై నెంబరు దావానందు పైన తెలిపిన **ప్రతివాది నెం.1కు** నోటీసులు అందజేయు నిమిత్తం ది.17.02.2023వ తేదీకి వాయిదా వేసినారు. కావున సదరు **1వ ప్రతివాది ది.17.02.2023** వ తేదీన పైన సూచించిన కోర్టువారి ఎదుట **ఉదయము గం.10.30 ని.లకు** స్వయముగా గాని, న్యాయవాది ద్వారాగాని హాజరయి తమకు గల ఆక్షేపణలు తెలుపుకోవలెను. లేనియెడల సదరు దావా మీపరోక్షమందు తీర్మానించెదరని యిందుమూలముగా తెలియజేయడమైనది.
వాయిదా:ది. **17.02.2023.**
(శ్రీ కోర్టువారి ఉత్తర్వుల ప్రకారము)

వీరమల్లు ఉమామహేశ్వరరావు, బి.కాం.యం.యల్.,
వాది తరపు న్యాయవాది,
సాయి గణేష్ టవర్స్, 3వ ఫ్లోర్,
1వ లేన్, భాను నగర్, ఫ్లాట్ నెం. 201,
బి.ఆర్.టి.ఎస్. రోడ్ దగ్గర,
విజయవాడ-5200011
సెల్ నెం. 9030635697

IN THE COURT OF THE HONOURABLE SENIOR CIVIL JUDGE AT GANNAVARAM.
I.A. No. 301/2022 IN O.S. No. 25/2022.

Between:
Pinnamaneni Swarna Kumari - Petitioner
AND
Machineni Koteswara Rao and another.
- Respondents

Respondent No. 1
Machineni Koteswara Rao, S/o. Venkataratnam, Hindu, aged about 50 yrs., R/o. D.No.48-4-15A, Ashok Gardens, Gunadala, Vijayawada-4.

పై నెంబరు దావానందు పైన తెలిపిన **రెస్పాండెంట్ నెం.1** కు నోటీసులు అందజేయు నిమిత్తం **ది.17.02.2023**వ తేదీకి వాయిదా వేసినారు. కావున సదరు **1వ రెస్పాండెంటు ది.17.02. 2023** వ తేదీన పైన సూచించిన కోర్టు వారి ఎదుట **ఉదయము గం. 10.30 ని.లకు** స్వయముగాగాని, న్యాయవాది ద్వారా గాని హాజరయి తమకు గల ఆక్షేపణలు తెలుపుకోవలెను. లేనియెడల మీ పరోక్ష మందు తీర్మానించెదరని యిందుమూలముగా తెలియజేయడమైనది.
వాయిదా:ది. **17.02.2023.**
(శ్రీ కోర్టువారి ఉత్తర్వుల మేరకు)

వీరమల్లు ఉమామహేశ్వరరావు, బి.కాం.యం.యల్.,
పిటిషనర్ తరపు న్యాయవాది, సాయి గణేష్ టవర్స్, 3వ ఫ్లోర్, 1వ లేన్, భాను నగర్, ఫ్లాట్ నెం.201, బి.ఆర్.టి.ఎస్. రోడ్ దగ్గర,
విజయవాడ-520 0011
సెల్ నెం. 9030635697

స్కూల్ గేమ్స్ రాష్ట్రస్థాయి సైక్లింగ్ పోటీలకు ముగ్గురు నున్న హైస్కూల్ విద్యార్థులు

విశాలాంధ్ర-విజయవాడ స్పోర్ట్స్ : స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఎస్‌జిఎఫ్ఐ) అంతర్ జిల్లాల సైక్లింగ్ పోటీలకు విజయవాడ రూరల్ మండలం నున్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ముగ్గురు విద్యార్థులు ఎంపికయ్యారు. ఈ నెల నాలుగో తేదీన నున్న వికాస్ విద్యాసంస్థల ఆవరణలో ఎస్‌జిఎఫ్ఐ కృష్ణాజిల్లా యూనిట్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఎంపికలలో నున్న హైస్కూల్ నుంచి 18 మంది విద్యార్థులు హాజరవ్వగా మూడు విభాగాలలో ముగ్గురు విద్యార్థులు ఎంపికయ్యారు. అండర్-14 బాలికల విభాగంలో డి లక్ష్మీభాయ్, అండర్ - 17 బాలుర విభాగంలో డి రామ్ చంద్ శ్రీ ఈశ్వర్, అండర్ - 19 బాలికల విభాగంలో డి పూజిత కృష్ణాజిల్లా జట్టుకు ఎంపికయ్యారు. అండర్ - 17, అండర్ - 19 బాలుర, బాలికల విభాగాలకు ఈ నెల 12వ తేదీ నుంచి 13వ తేదీ వరకు, అండర్ - 14 బాల బాలికల విభాగానికి ఈ నెల 16వ తేదీ నుంచి 17వ తేదీ వరకు నరసరావుపేటలో రాష్ట్రస్థాయి సైక్లింగ్ పోటీలు నిర్వహించనున్నారు. ఆ పోటీలలో నున్న హైస్కూల్‌కు చెందిన ముగ్గురు విద్యార్థులు కృష్ణాజిల్లా జట్టుకు ప్రాతినిధ్యం వహించనున్నారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వజ్రాల భూపాల్‌రెడ్డి పాఠశాలలో బుధవారం జరిగిన కార్యక్రమంలో రాష్ట్రస్థాయి స్కూల్‌గేమ్స్ సైక్లింగ్ పోటీలకు ఎంపికైన లక్ష్మీభాయ్, రామ్‌చంద్ శ్రీ ఈశ్వర్, పూజితను అభినందించారు. అలాగే విద్యార్థులను సైక్లింగ్‌లో పాల్గొనేందుకు ప్రోత్సహించిన ఫిజికల్ డైరెక్టర్ ముత్యాల వెంకటేశ్వరరావును కూడా అభినందించారు. ఈ కార్యక్రమంలో ఫస్ట్ అసిస్టెంట్ సూరపనేని రవి ప్రసాద్, సెకండ్ అసిస్టెంట్ బి శ్రీనివాసరావు, స్టాఫ్ సెక్రటరీ కామినేని కోటేశ్వరరావు పాల్గొన్నారు.

వంటనూనెల జాబితాతో ప్రవేశించిన కార్గిల్

-జెమిని ప్యూరిట్ బ్రాండ్ ఆయిల్ విడుదల

విశాలాంధ్ర-విజయవాడ (లబ్బీపేట) : దక్షిణ భారతదేశంలో తమ వంటనూనెల పోర్ట్‌ఫోలియో విస్తరించాలనే తమ నిబద్ధతను పునరుద్ఘాటిస్తూ , కార్గిల్ నేడు తమ జెమినీ ప్యూరెట్ ను ఆంధ్రప్రదేశ్ లోని విజయవాడ తెలంగాణా రాష్ట్ర రాజధాని హైదరాబాద్ లో విడుదల చేసినట్లు కార్గిల్ ఫుడ్ ఇంగ్రీడియెంట్స్ , దక్షిణాసియా , కన్స్యూమర్ బిజినెస్ లీడర్ అవినాష్ త్రిపాఠీ తెలిపారు. బుధవారం బందర్ రోడ్డులోని ఓ హోటల్ లో జెమిని ప్యూరిట్ బ్రాండ్ అయిల్ ను విడుదల చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ జెమినీ ప్యూరెట్ బ్రాండ్ దక్షిణ భారతదేశంలోని ఆంధ్రప్రదేశ్ , తెలంగాణా , కర్నాటక , తమిళనాడు రాష్ట్రాలలో వినియోగదారులకు అందుబాటులో ఉంటుందని తెలిపారు . ఈ సంవత్సరం , జెమినీ బ్రాండు ఇది 40 వ వార్షికోత్సవ సంవత్సరం కావడంతో ప్రభుత్వం చేత గుర్తించబడిన సంస్థ కన్స్యూమర్ వాయిస్ చేత 20 నాణ్యతా ప్రమాణాలను పరిశీలించిన తరువాత భారతదేశంలో నెంబర్ 1 సన్ ఫ్లవర్ నూనెగా ర్యాంక్‌ను సాధించిందన్నారు. ఈ ఆవిష్కరణతో ప్రీమియం నాణ్యతా ఉత్పత్తిని తీసుకువస్తున్నామని, ఇది మార్కెట్లో వినియోగదారుల అవసరాలను తీర్చనుంది వివరించారు. అనంతరం దక్షిణ భారత మార్కెట్పై తమ దృష్టితో పాటుగా , బ్రాండ్ పట్ల వినియోగదారుల నమ్మకం గురించి కార్గిల్ ఫుడ్ ఇంగ్రీడియెంట్స్ , సౌత్ ఆసియా , సుబిన్ శివన్ , మార్కెటింగ్ అండ్ ఇన్సైట్స్ లీడర్ మాట్లాడుతూ " గత నాలుగు దశాబ్దాలుగా , జెమినీ విజయవంతంగా వినియోగదారుల నడుమ నమ్మకాన్ని నిర్మించుకుంటుందన్నారు. ఈ అధ్యయనంలో భాగంగా భారతదేశంలో 12 సన్ఫ్లవర్ ఆయిల్ బ్రాండ్లను 20 నాణ్యతా ప్రమాణాలతో ఎఫ్ఎస్ఎస్ఏఐ (ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ అథారిటీ ఆఫ్ ఇండియా), అగ్మార్క్, లీగల్ మెథడాలజీ నిబంధనలకు అనుగుణంగా పరిశీలించడం జరిగిందన్నారు.

దివంగత కార్మిక నాయకుడికి సంతాప సభ

విశాలాంధ్ర- కంచికచర్ల: ఎంతోమంది భవన నిర్మాణ కార్మికులకు బతుకు బాట చూపించి, ఈ ప్రాంత కార్మిక వర్గానికే ఆదర్శప్రాయంగా నిలిచిన భవన నిర్మాణ కార్మిక నేత దివంగత కాజా లక్ష్మీనారాయణ జీవితం ప్రతి ఒక్కరికి ఆదర్శప్రాయమని పలువురు వక్తలు కొనియాడారు. కంచికచర్ల ఏరియా భవన నిర్మాణ కార్మిక సంఘం వ్యవస్థాపకులు దివంగత కాజా లక్ష్మీనారాయణ గుంటూరు (మేస్త్రి) సంతాప సభ ఘనంగా జరిగింది. ఎన్టీఆర్ జిల్లా బిల్డింగ్ కన్ స్ట్రక్షన్స్ వర్కర్స్ యూనియన్ కంచికచర్ల మండల కమిటీ ఆధ్వర్యంలో గొట్టముక్కల రోడ్డులో జరిగిన సంతాప సభలో లక్ష్మీనారాయణ కుమారులు కాజా వెంకటేశ్వర రావు, హరిబాబు, కృష్ణమూర్తి, ఎన్టీఆర్ జిల్లా బిల్డింగ్ కన్ స్ట్రక్షన్స్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు జి. హరికృష్ణారెడ్డి, బిల్డింగ్ కన్ స్ట్రక్షన్స్ వర్కర్స్ యూనియన్ వీరులపాడు మండల అధ్యక్షులు ఎస్ కె కాజా పీరా, మొయినుద్దీన్ మాస్టర్, బిల్డింగ్ కన్ స్ట్రక్షన్స్ వర్కర్స్యూనియన్ కంచికచర్ల మండల అధ్యక్ష కార్యదర్శులు సయ్యద్ ఖాసిం, కాశీ బోయిన రాంబాబు, యూనియన్ ఉపాధ్యక్షులు కాలవ వెంకట్రావు, లక్కిశెట్టిఆంజనేయులు, చిన్న శెట్టి ప్రసాద్ లు పాల్గొని, ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని మౌనం పాటించి లక్ష్మీనారాయణ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. సంతాప సభను ఉద్దేశించి వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు జి హరికృష్ణ రెడ్డి మాట్లాడుతూ కంచికచర్ల ఏరియా తాపీ కార్మిక సంఘం వ్యవస్థాపకులు దివంగత కాజా లక్ష్మీనారాయణ భవన నిర్మాణ కార్మికులకు ఎందరికో స్ఫూర్తి 'దాయకంగా నిలిచి, బతుకు బాట చూపించారని, ప్రతి ఒక్కరు ఆయనను ఆదర్శంగా తీసుకోవాలని కోరారు. భవన నిర్మాణ కార్మికుల ఆర్థిక పురోభివృద్ధికి, కార్మికుల హక్కుల కోసం ఆయన కృషి మరువలేనిదన్నారు. కార్మికులకు ఎల్లప్పుడు అండగా ఉంటూ, తమ కుటుంబ సభ్యులగానే చూసుకుని వారని అన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు వేమా వెంకటేశ్వరరావు, బడేటి దాసు, బందారు శీను, తాటికొండ వీరయ్య, సయ్యద్ చిన్న ఖాసిం, దూళ్ళ సాయి, కోనేటి వెంకట్రావు, మర్రిపూడి చిన్న కృష్ణారావు, పర్వతం వెంకటేశ్వరరావు, కంచికచర్ల మండల భవన నిర్మాణ కార్మికులు పాల్గొన్నారు.

వ్యవస్థను నిర్వీర్యం చేసే పనులు మానుకోవాలి: వట్టికొండ

విశాలాంధ్ర-వీరులపాడు: వీరులపాడు మండల నిర్మాణంలో ఎన్నో ఆశలతో, భావితరాలకు మంచి పునాది వేయాలనే సంకల్పంతో ఎన్నో ఎకరాలను సమకూర్చామని, వ్యయ ప్రయాసలు కూర్చి ప్రభుత్వ కార్యాలయాలను నిర్మించామని, అడిగిందే తడవుగా ప్రతి ఒక్కటి సమకూర్చామని, అటువంటి వీరులపాడు గ్రామాన్ని కాదని మండల కేంద్రాన్ని జుజ్జూరు గ్రామానికి తరలించటం అత్యంత హేయమైన చర్యని దీనిని తీవ్రంగా ఖండిస్తున్నామని వీరులపాడు మాజీ గ్రామ సర్పంచ్ వట్టికొండ చంద్రమోహన్ పేర్కొన్నారు. వీరులపాడు లో మండల కార్యాలయాల కోసం కోట్లలో డబ్బులు వెచ్చించి నిర్మాణాలు చేపట్టారని, ఇప్పుడు వాటిని నిర్వీర్యం చేసి వేరొక గ్రామానికి తరలించటం ప్రభుత్వంపై అదనపు భారం పడుతుందని, ఈ ఎమ్మెల్యే ఎమ్మెల్సీలు మూడు సంవత్సరాల పదవీకాలంలో యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించే ఏ ఒక్క పరిశ్రమ గాని, విద్యా వ్యవస్థను గాని నెలకొల్పాలన్న అనే ఆలోచన లేదుగాని వ్యవస్థను నిర్వీర్యం చేసే ఇటువంటి కార్యక్రమాలకు పాల్పడుతున్నారని విమర్శించారు. ఇప్పుడు జుజ్జూరు నుండి వేరొక గ్రామానికి మండల కేంద్రం అడిగితే మారుస్తారా? అని ప్రశ్నించారు. రాజకీయాలకు అతీతంగా ఏర్పడిన వీరులపాడు మండల కమిటీ గత 55 రోజులుగా రిలే నిరాహార దీక్షలు చేస్తున్న పట్టించుకోకుండా ఏకపక్షంగా నిర్ణయం తీసుకోవటాన్ని వీరులపాడు మండల కమిటీ ముక్తకంఠంతో వ్యతిరేకిస్తున్నట్లు తెలిపారు.

సొంతింటిలో ఉగాది వేడుకలు జరుపుకునేలా నిర్మాణాలు పూర్తి చేయండి

విశాలాంధ్ర-విజయవాడ (కృష్ణలంక) : వచ్చే ఉగాదికి పేదలు సొంతింటిలో ఉగాది వేడుకలు జరుపుకునేలా నిర్మాణాలు పూర్తి చేయాలని, ఉగాది రోజున 16 వేల సామూహిక గృహ ప్రవేశాలకు ఇళ్లను సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ ఎస్.డిల్లీరావు అధికారులను ఆదేశించారు. నిర్మాణం తుది దశలో ఉన్న లబ్దిదారులతో ముఖముఖి మాట్లాడి వారికి ఎదురైన సమస్యలను పరిష్కరించడం ద్వారా మార్చి 22న 16 వేల సామూహిక గృహ ప్రవేశాల లక్ష్యాన్ని పూర్తి చేసి గృహాలను సిద్ధం చేయాలన్నారు. జిల్లాలో జగనన్న గృహ నిర్మాణాలు, నాడు-నేడు పనుల ప్రగతి, జగనన్నకు చెబుదాం సమస్యల పరిష్కారంపై స్థానిక కలెక్టర్ కార్యాలయం నుంచి బుధవారం కలెక్టర్ వీడియోకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం స్టేట్ హౌసింగ్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో జిల్లాలో జగనన్న కాలనీల్లో నిర్మిస్తున్న గృహాల్లో ఉగాది పర్వదినం రోజున లబ్దిదారులతో గృహ ప్రవేశాలు జరిపించాలని లక్ష్యంగా నిర్దేశించినట్లు తెలిపారు. ఇప్పటికే 7,276 గృహ నిర్మాణాలు పూర్తి చేయడం జరిగిందని, మరో 9071 గృహాలు పూర్తి చేయాల్సి ఉందన్నారు. తుది దశలో ఉన్న 2,807 గృహాల లబ్దిదారులతో వెంటనే ముఖముఖి మాట్లాడి నిర్మాణం పూర్తి చేయడంలో వారికి ఎదురైన సమస్యలను పరిష్కరించి పూర్తి చేయాలని ఆదేశించారు. నగర పాలక సంస్థ పరిధిలోని తూర్పు, పశ్చిమ, సెంట్రల్ నియోజకవర్గాలు, మండలాలు, మున్సిపల్ పరిధిలోని లే అవుట్లలో ప్రారంభించాల్సిన గృహా నిర్మాణాలను పూర్తి చేసేలా లక్ష్యాలను నిర్దేశించుకోవాలన్నారు. ప్రతి వారం 500 రూఫ్ లెవల స్థాయిలోని నిర్మాణాలను రూఫ్ కాస్టింగ్ స్థాయిలోకి తీసుకురావాలన్నారు. గృహ నిర్మాణాల లక్ష్యాలను సాధించడంలో మండల స్పెషల్ ఆఫీసర్లు, మున్సిపల్ కమీషనర్లు, ఎంపీడీవోలు, హౌసింగ్ ఏఇలతో కూడిన టీమ్ సభ్యులు బాధ్యత వహించాలన్నారు. నాడు-నేడు కార్యక్రమం ద్వారా జిల్లాలో చేపడుతున్న అదనపు తరగతి గదులు, కాంపౌండ్ వాల్స్, మరుగుదొడ్ల నిర్మాణాలు వివిధ దశల్లో ఉన్నాయన్నారు. జిల్లాలో 587 పాఠశాలల్లో 250 అదనపు తరగతి గదులు, 166 కాంపౌండ్ వాల్స్, 391 టాయిలెట్లు, 319 వంటగదుల నిర్మాణ పనులు మంజూరు చేయడం జరిగిందన్నారు. నిర్మాణాలను పూర్తి చేసేందుకు విద్య, ఇంజనీరింగ్, సమగ్ర శిక్ష అభియాన్ ఇంజనీరింగ్ అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. జగనన్న శాశ్వత భూ హక్కు, భూ రక్ష పత్రాల పంపిణీ, లంక భూముల లీజు రెన్యూవల్ పూర్తి చేయాలన్నారు. జగనన్నకు చెబుదాం ద్వారా జిల్లాలో ఇప్పటివరకు 27 అర్జీలను స్వీకరించినట్లు తెలిపారు. ఆయా శాఖల అధికారులు అర్జీలను సత్వరమే పరిశీలించి నివేదికను సమర్పించాలని ఆదేశించారు. ఈ వీడియోకాన్ఫరెన్స్‌లో జేసీ ఎస్.నుపూర్‌అజయ్, డీఆర్వో కే.మోహన్‌కుమార్, హౌసింగ్ పీడీ శ్రీదేవి, డీఇ రవికాంత్, డీఈవో సీవీ.రేణుక, జిల్లాకు చెందిన మండల స్పెషల్ ఆఫీసర్లు, ఎంపీడీవోలు, ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

27, 28 తేదీల్లో కేబీఎన్ లో సైన్స్ దినోత్సవ వేడుకలు

విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్): కాకరపర్తి భావనారాయణ కళాశాల ఆధ్వర్యంలో ఈ నెల 27, 28 తేదీల్లో సైన్స్ దినోత్సవ వేడుకలను నిర్వహించనున్నట్లు ఆ కళాశాల కార్యదర్శి తూనుకుంట్ల శ్రీనివాసు చెప్పారు. సైన్స్ దినోత్సవ పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమం ఆ కళాశాల కమిటీ కార్యాలయంలో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా తూనుకుంట్ల శ్రీనివాసు పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 28వ తేదీన జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకొని 27, 28 తేదీల్లో వేడుకలను నిర్వహించనున్నట్లు వివరించారు. ప్రధానంగా పాఠశాల విద్యార్థుల్లో సైన్స్ పట్ల అవగాహన పెంపొందించటం, వైజ్ఞానిక అంశాలపై పట్టు సాధించే దిశగా వారిని ప్రోత్సాహించేందుకు పలు కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. 27వతేదీన ఎనిమిది, తొమ్మిది తరగతి విద్యార్థులకు సైన్స్ స్టోరీ టెలింగ్, పోస్టర్ ప్రెజంటేషన్, బెస్ట్ ఫ్రమ్ వేస్ట్ పోటీలు ఉంటాయన్నారు. అలాగే పదో తరగతి విద్యార్థులకు ఫిరియాడిక్ టేబుల్ క్విజ్, కార్బన్ మాల్ మేకింగ్ పోటీలుంటాయన్నారు. 28వ తేదీన యుజీ, పీజీ విద్యార్థులకు వివిధ పోటీలు నిర్వహిస్తామన్నారు. ఈ సమావేశంలో ప్రిన్సిపాల్ డాక్టర్ వీ నారాయణరావు, వేడుకల కన్వీనర్ డాక్టర్ టీ భాగ్యకుమార్, వైస్ ప్రిన్సిపాల్స్ పీఎల్ రమేష్, డాక్టర్ ఎం వెంకటేశ్వరరావు, కే మోహన్‌బాబు(షైన్) షైన్ డైరెక్టర్ కే చంద్రశేఖర్, ఐక్యూఏసీ కన్వీనర్ డాక్టర్ జీ కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

బలుగూరి సాగర్ కుటుంబానికి ఆర్థిక సాయం

విశాలాంధ్ర-పెనుగంచిప్రోలు : పెనుగంచిప్రోలు మండలం పెనుగంచిప్రోలు గ్రామం లో ఇటీవల రోడ్డు ప్రమాదం లో మరణించిన జనసేన పార్టీ మండల కార్యదర్శి బలుగూరి సాగర్ కుటుంబాన్ని జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ ఆదేశాలు మేరకు ఉమ్మడి కృష్ణా జిల్లా అధ్యక్షులు బండ్రెడ్డి రామకృష్ణ . సాగర్ కుటుంబాన్ని పరామర్శించి వారి కి 50 వేల రూపాయల చెక్ ని అందజేసి వారి కుటుంబానికి జనసేన పార్టీ అండగా ఉంటుందని అన్నారు. అనంతరం అదే రోడ్డు ప్రమాదానికి గురైన తన్నీరు గోపినాథ్ కుటుంబాన్ని పరామర్శించి వారి కుటుంబానికి భరోసా కల్పించారు. ఈ సందర్భంగా బండ్రెడ్డి రామకృష్ణ మాట్లాడుతూ జనసేన పార్టీ కార్యకర్తలకు వారి కుటుంబాలకు పవన్ కళ్యాణ్ ఎల్లప్పుడూ అండగా ఉంటారని ఈ నెల 10 నుంచి 28 వరకు మూడో విడత క్రియాశీలక సభ్యత్వ నమోదు కార్యక్రమం మొదలవుతుందని కష్టపడి పార్టీ కోసం పని చేసే ప్రతి కార్యకర్త తప్పనిసరిగా సభ్యత్వం నమోదు చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమం లో ఉమ్మడి కృష్ణా జిల్లా కార్యవర్గ కమిటీ సభ్యులు నియోజకవర్గ నాయకులు వీరమహిళలు మండల జనసేన పార్టీ అధ్యక్షులు తునికి పాటి. శివా. పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

40 రోజుల్లో 10 వేల కుటుంబాల సమస్యలు సేకరించాం

విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్): నలభై రోజుల్లో పది వేల కుటుంబాల సమస్యలు సేకరించామని విజయవాడ పశ్చిమనియోజకవర్గ టీడీపీ నాయకులు ఎమ్ఎస్ బేగ్, పెందుర్తి శ్రీనివాస్ అన్నారు. బుధవారం నియోజకవర్గంలోని టీడీపీ కార్యాలయంలో విలేకరుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అధికారంలో ఉన్నా ప్రతి పక్షంలో ఉన్నా టిడిపి ఎప్పుడూ ప్రజా పక్షమేనని ప్రజా వ్యతిరేక నిర్ణయాల ప్రజలను చైతన్య వంతులు చేయటంలో పశ్చిమ టిడిపి ముందంజలో ఉందని తెలిపారు. నియోజకవర్గంలో డివిజన్ పార్టీలు నిత్యం ప్రజల్లో ఉండటమే కాక ప్రజా సమస్యల మీద పోరాటం చేస్తూ ప్రజలకి అండగా ఉంటున్నారని తెలియజేశారు. ఈనెలలో 20వేలు, మార్చి నెలలో 20 వేల కుటుంబాలను ఇంటింటికీ సందర్శించేలా ప్రణాళికలు రూపొందించామని కేవలం ప్రజలను కలవడమే కాక సాధ్యమైన అన్ని సమస్యల మీద ఎంపి శ్రీ కేశినేని శ్రీనివాస్ (నాని) ద్వారా పరిష్కారానికి కృషి చేస్తున్నామని చెప్పారు. ప్రజలు ఏ సమస్య వచ్చినా నియోజక వర్గం పార్టీ కార్యాలయానికి వాట్స్ యాప్ నంబర్ 7799447185 ద్వారా తెలియజేయాలని కోరారు. ఈ సమావేశంలో ఎన్టీఆర్ జిల్లా టిడిపి వాణిజ్య విభాగం అధ్యక్షులు సోలంకి రాజేంద్ర కుమార్, క్లస్టర్ ఇంఛార్జ్ బూర కనకారవు, డివిజన్ పార్టీ అధ్యక్షులు పిళ్ళా సుదర్శన్, కుప్పుల గంగాధర్ రెడ్డి, యూనిట్ ఇంఛార్జ్‌లు తమ్మిన శేఖర్, గంటా రాజులు పాల్గొన్నారు

సచివాలయ వ్యవస్థతో మెరుగైన పాలన : ఎమ్మెల్యే రక్షణ నిధి

విశాలాంధ్ర-తిరువూరు: గ్రామ సచివాలయ వ్యవస్థతో ప్రభుత్వ పాలన ప్రజలకు మరింత చేరువైందని తిరువూరు ఎమ్మెల్యే కే రక్షణ నిధి అన్నారు. తిరువూరు నగర పంచాయతీ 7వ వార్డు శాంతినగర్ లో బుధవారం గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమం నిర్వహించారు. ప్రభుత్వ పథకాలను త్వరితగతిన ప్రజలకు అందే విధంగా గ్రామ వాలంటీర్లు సచివాలయ సిబ్బంది కృషి చేస్తున్నారని ఎమ్మెల్యే వివరించారు. గతంలో వార్డుల్లో సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లడానికి నగర పంచాయతీ కార్యాలయానికి వెళ్లాల్సి వచ్చేదని, సచివాలయం ఏర్పాటుతో ఎక్కడికక్కడే సమస్యలు పరిష్కారం అవుతున్నాయని పేర్కొన్నారు. ప్రజలు సచివాలయ సేవలను సద్వినియోగం చేసుకోవాలని గతంలో మీసేవ కేంద్రాల ద్వారా లభ్యమైన అన్ని ప్రభుత్వ సేవలు సచివాలయాల్లో లభ్యమవుతున్నాయని పేర్కొన్నారు. సంక్షేమ పథకాలకు దరఖాస్తు చేసుకోవడానికి సచివాలయాల్లో అన్ని ఏర్పాట్లు జరిగాయని, వాలంటీర్లు తమ పరిధిలో మరింత మెరుగైన సేవలు అందించాలని ఎమ్మెల్యే సూచించారు. వార్డుల్లో ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా ప్రయోజనం పొందిన లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి బ్రోచర్ల అందజేశారు. ఏఎంసి చైర్మన్ శీలం నాగ నర్సిరెడ్డి, జడ్పిటిసి సభ్యుడు యరమల రామచంద్రారెడ్డి, ఎంపీపీ గద్దల భారతి, నగర పంచాయతీ చైర్ పర్సన్ గత్తం కస్తూరిబాయి, వైస్ చైర్ పర్సన్లు వెలుగోటి విజయలక్ష్మి, గుమ్మ కోటేశ్వరి, వార్డు కౌన్సిలర్లు తంగిరాల వెంకట రెడ్డి, పరసా శ్రీనివాసరావు, మోదుగు ప్రసాదు, పసుపులేటి శేఖర్ బాబు, కాకర్లమూడి సుందర్ కుమార్, ఏరువ ప్రకాశ్ రెడ్డి, సత్యనారాయణ, రాష్ట్ర యాదవ్ కార్పొరేషన్ డైరెక్టర్ కాలసాని విజయలక్ష్మి, ముష్టికుంట్ల పిఏసిఎస్ చైర్మన్ బండి రవి కుమార్, పార్టీ నాయకులు మస్తాన్, రఫీ, జాకీర్, నల్లబోతుల రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

శివశక్తి నగర్, ఓమ్ శక్తి నగర్ల వద్ద ఆర్టీసీ సిటీ బస్సుల రిక్వెస్ట్ బస్టాపు ఏర్పాటు

ప్రారంభించిన విశ్రాంత వి డి ఓ బైటారి సూర్యప్రకాశరావు

విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్): విజయవాడ రూరల్ ప్రాంతంలోని శివశక్తి నగర్, ఓమ్ శక్తి నగర్, ప్రాంతాల్లో ఏపీఎస్ ఆర్టీసీ ఏర్పాటు చేసిన రిక్వెస్ట్ బస్టాఫ్ ను బుధవారం ఉదయం లాంఛనంగా ప్రారంభించారు. విశ్రాంత విలేజ్ డెవలప్మెంట్ ఆఫీసర్ బైటారి సూర్యప్రకాశరావు చేతులు మీదుగా పూజలు నిర్వహించారు. విద్యాధరపురం ఆర్టీసి డిపో మేనేజర్ కనకమేడల సుబ్రహ్మణ్యేశ్వరరావు ఈ రూటులో రిక్వెస్ట్ స్టాప్ కి ఆమోదించగా ఓమ్ శక్తి నగర్ లోని శ్రీ దేవీ కరుమారి అమ్మన్ శక్తి పీఠం పీఠాధిపతి శ్రీ శ్రీ శ్రీ కరుమారి దాసు ఆధ్వర్యంలో రిక్వెస్ట్ బోర్డులు ఏర్పాటు చేయగా అధికారికంగా దీన్ని ప్రారంభించారు. కొత్తూరు తాడేపల్లి రూటులో సి వి ఆర్ ఫ్లై ఓవర్ బ్రిడ్జికి ఇరువైపులా వున్న అస్త్రఅపార్ట్మెంట్,సాయి అమరావతి హైట్స్, విఘ్నేష్ హైట్స్, అపార్మెంట్,అలాగే శివదుర్గ ఎన్క్లేవ్ (బచ్చు అమరనాథ్ అపార్మెంట్) వాసులు వందలాది కుటుంబాలకు చెందిన వారు గతనెల్లో ఆర్టీసీ డి ఎమ్ కి వందలాది మంది సంతకాలతో కూడిన వినతిపత్రాలు అందించిన విషయం తెల్సిందే. దానికి సానుకూలంగా స్పందించిన డి ఎమ్ సుబ్రహ్మణ్యేశ్వరరావు అనుమతి ఇచ్చారు. బుధవారం నుండి ఈ రూట్లలో జక్కంపూడి కాలనీ కి రాకపోకలు సాగించే ప్రతి సిటీ బస్సులు ఈ రిక్వెస్ట్ స్టాప్ వద్ద అగుతాయని ఈ అవకాశాన్ని ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని డి ఎమ్ ప్రయాణికులకు విజ్ఞప్తి చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో శ్రీ శ్రీ శ్రీ కరుమారి దాసు, జ్ఞానేష్, రాయల కృష్ణ, జమ్ము శ్రీనివాసరావు, బైటారి కమలిని,ఎమ్ శ్రీనివాసరావు, బైటారి మనోజ్,బైటారి సుధీర్,స్థానిక పెద్దలు తదితరులు పాల్గొన్నారు. కాగా ఇక్కడ ఆర్టీసీ వారు రిక్వెస్ట్ స్టాప్ ఏర్పాటు చేయడం పట్ల స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

పోతిన మహేష్ దమ్ముంటే నాపై కార్పొరేటర్‌గా పోటీ చేసి గెలువు : మహాదేవ్ అప్పాజీ

విశాలాంధ్ర-విజయవాడ (వన్ టౌన్): జనసేన పార్టీ నాయకులు పోతిన వెంకట మహేష్ తన పై కార్పొరేటర్ గా గెలిచి చూపించాలని 53వ డివిజన్ కార్పొరేటర్ మహాదేవ్ అప్పాజీ అన్నారు. బుధవారం డివిజన్‌లో శిలాఫలకం వద్ద విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొన్ని ఏళ్ల తరబడి వుండి పాడైపోయే స్థితికి వచ్చిన మంచినీటి పైపులైన్లను మార్చేందుకు ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు, నగర మేయర్ భాగ్యలక్ష్మి చొరవతో ఈనెల 5వతేదీన శంకుస్థాపన చేసుకోవడం జరిగిందని తెలిపారు. దీనిని కూడా జనసేన నాయకుడు పోతిన మహేష్ రాజకీయం చేయడం తగదు అన్నారు. మహేష్ ఒక చదువుకున్నా అజ్ఞాని అని దుయ్యబట్టారు. మహేష్ కి దమ్ము ధైర్యం వుంటే తన పై కార్పొరేటర్ గా పోటీ చేసి గెలవాలని సవాలు విసిరారు. డివిజన్ లో జరిగే అభివృద్ధి పనులను అడ్డుకునేందుకు మహేష్ ప్రయత్నం చేస్తున్నాడని ప్రజలు గమనించాలని కోరారు. శిలాఫలకం నగర పాలక సంస్థ రోడ్ కి ప్రక్కన వెయ్యడం జరిగిందని తెలిపారు. కోర్టులో వున్న ఆస్తుల గురించి మాట్లాడటం సబబు కాదన్నారు. అసలు శిలాఫలకం ఎవరు వేస్తారు ఎందుకు వేస్తారో ముందు తెలుసుకోవాలని హితవు పలికారు. ఈకార్యక్రమంలో సమీర్, ఛాన్ భాష, తాతపూడి చందూ, అరసవల్లి కంచిబాబు, పడాల రాజేష్, నల్లబిల్లి మోహన్, రెహమాన్ తదితరులు పాల్గొన్నారు.

పూల కప్పెరతో ఊరేగింపు

విశాలాంధ్ర-పెనుగంచిప్రోలు : శ్రీతిరుపత మ్మ అమ్మ వారి పెద్ద తిరుణాళ్ళ మహెూత్సవాల లో భాగంగా నాల్గోరోజు బుధవారం ఆది పరాశక్తి అంకమ్మ అమ్మ వారికి పలురకాల క్ర తువులు నిర్వహించారు. దీనిలో భాగంగా బైనీడి వారు పూల క ప్పె ర తో గ్రామం లో ఊరే గింపు నిర్వహించారు. తూర్పు బజారు వినాయక గుడి సెంటర్ లోని రావి చెట్టు వద్ద పొంగళ్ళు తయారు చేసి ఊరే గింపుగా తీసుకువచ్చి అంకమ్మ అమ్మ వారికి నై వేద్యంగా సమర్పించారు. ఈ ఉత్సవం లో గ్రామానికి చెందిన శాలి వాహనులు. జలబిందెల వంశీకులు ఆలయ ఏ ఈ ఓ లు ఉమా పతి. కొండలరావు. సిబ్బంది పాల్గొన్నారు.

ఎంపీడీఓగా బాధ్యతలు స్వీకరించిన కె.బాలశంకరరావు

విశాలాంధ్ర-కంచికచర్ల: కంచికచర్ల మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా కె. బాలశంకరరావు బాధ్యతలు చేపట్టారు. ఆయను మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా నియమిస్తూ జిల్లా కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు ఆయన బుధవారంబాధ్యతలు స్వీకరించారు. గత కొన్ని నెలలుగా పూర్తి స్థాయి అధికారి లేరు. ఇన్చార్జి ఎంపిడిఓ గా బాధ్యతలు నిర్వహిస్తున్న కె. బాలశంకరరావు పూర్తి స్థాయి బాధ్యతలు చేపట్టిడంతో పూర్తి స్థాయిలో ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను అమలు చేసే వీలు కలుగ్నుందని ఆశాభావం వ్యక్తమవతున్నాయి.

ప్రకృతి వ్యవసాయం ప్రజలకు మేలు

విశాలాంధ్ర-గంపలగూడెం : జి-20 ఈవెంట్స్ లో భాగంగా నెమలి ,ఉమ్మడి దేవరపల్లి గ్రామాలలో ప్రకృతి వ్యవసాయం చేస్తున్న రైతు క్షేత్రాలను డిఎంఎఫ్ విజయ్ కుమారి, అగ్రికల్చర్ అసిస్టెంట్ కే మునీంద్ర బుధవారం నాడు పరిశీలించారు. ప్రకృతి వ్యవసాయం చేస్తున్న విభాగం రైతు సాధికారిత సంస్త ఎన్టీఆర్ జిల్లా వారు ప్రకృతి వ్యవసాయ రైతు వరి పొలాలను సందర్శించారు. అనంతరం రైతులకు విజయ్ కుమారి తగు సూచనలు ఇచ్చారు. ప్రకృతి వ్యవసాయం చేసే రైతులతో విజయ్ కుమారి మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అలాగే గ్రామ సచివాలయంలో ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల వనరుల క్షేత్రం ప్రారంభోత్సవం చేశారు. ఈ కార్యక్రమంలో ఐ బి కోఆర్డినేటర్ భాను, ఏ మణి, వి స్వాతి, టీ కోటేశ్వరమ్మ, జి విజయ లక్ష్మి, బి చిదంబర రావు, టి పుష్పలత, వాలంటీర్లు, రైతులు పాల్గొన్నారు.